..గుర్తుకు రావడం లేదు



• ఇలా నివారించుకుందాం

- రోజూ నిద్రకు 8 గంటలకు కేటాయించాలి.
- డిజిటల్ స్క్రీన్ వినియోగం తగ్గించాలి.
- సుదీర్ఘంగా స్క్రీన్‌పై ఉండాల్సి వచ్చినప్పుడు మధ్యమధ్యలో విరామం తీసుకోవాలి.
- జ్ఞాపకశక్తి, మెదడు పనితీరుపై సానుకూల ప్రభావం చూపేలా వ్యాయామాలు చేయాలి.
- వాకింగ్, జాగింగ్, ఎరోబిక్స్ వంటి వ్యాయామాలు మెదుడులోని హిప్పా క్యాంపస్ భాగం వృద్ధికి తోడ్పడుతాయి.
- గ్రీన్ టీ, తాజా ఆకుకూరలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలి.

బంధువుల పేర్లు.. వారి వరసులు గుర్తుకు రావడంలేదు. స్నేహితుల ఫోన్ నెంబర్లు, ఏ పేర్లతో సేవ్ చేసుకున్నారో వెంటనే తెలుసు కోలేకపోతున్నాం. దగ్గరి బంధువులు, సన్నిహితులతో పాటు కొన్ని సార్లు కుటుంబసభ్యుల పుట్టిన రోజు, పెళ్లి రోజులపైనా తడబాటు. చిన్నచిన్న నోటి లెక్కలను కూడా స్వయంగా చేయలేక తికమకపడుతున్నాం. ఒక్కోసారి సొంత ఫోన్ నంబరును కూడా తప్పుగానే చెబుతున్నాం. ఇదీ నేటి సెల్‌తరంలో చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా సోకి న డిజిటల్ జబ్బు. ప్రస్తుతం ఇలాంటి సమస్యలు చాలామందిని వేధిస్తు న్నాయి. సెల్‌ఫోన్‌ను ఓ పరికరంగా కాకుండా అదో వ్యసనంగా మారడం తోనే తలెత్తిన మానసిక సమస్యగా పలువురు చెప్పున్నారు. గుర్తుకురాక పోవడం.. మతిమరుపు.. తికమక.. గజిబిజి.. తదితర లక్షణాలన్నీ గతంలో వృద్ధులో ఉండేవి. అయితే ప్రస్తుతం ఆ లక్షణాలన్నీ కూడా సెల్‌ఫోన్‌కు బానిసలుగా మారిన విద్యార్థుల నుంచి పెద్దల వరకు కనిపిస్తున్నాయి. ఈ లక్షణాలు తరుచుగా ఉంటే మాత్రం డిజిటల్ డిమెన్షియా అయి ఉండొచ్చని వైద్యులు చెబుతున్నారు.

పేర్లు, ఫోన్ నెంబర్లపైనా తడబాటు

- రోజురోజుకు పెరిగిపోతోన్న మతిమరుపు
- సెల్‌ఫోన్ల అతి వినియోగంతోనే ఈ ప్రమాదం
- విజ్ఞానం, సృజనాత్మకతను దెబ్బతీస్తోన్న స్క్రీన్లు
- విద్యార్థుల నుంచి యువతరం వరకూ సమస్య
- చాపకింద నీరులా విస్తరిస్తోన్న డిజిటల్ డిమెన్షియా సమస్య

2022లో గుర్తింపు

సాంకేతికను అతిగా వినియోగించుకునే వారిలో జ్ఞాపకశక్తిలో వచ్చే సమస్యలను డిజిటల్ డిమెన్షియాగా 2022లో వైద్యులు గుర్తించారు. దీన్ని డిమెన్షియాకు ప్రారంభంలో వచ్చే మైల్డ్ కాగ్నిటివ్ ఇంపైర్‌మెంట్‌గా కూడా పిలుస్తారు. ప్రస్తుతం దీనిపై పరిశోధనలు జరుగుతున్నాయని వైద్యులు చెబుతున్నారు. ఎక్కువ సమ యాన్ని స్క్రీన్‌కు కేటాయించడంతో జ్ఞాపకశక్తిపై ప్రభావం పడుతుందంటున్నారు.

8లో..



సండే స్పెషల్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కృతికా శుక్లా, జేసీ సూరజ్, డీఆర్వో మురళి

ప్రజా పాలనే నా నినాదం

- జిల్లా అభివృద్ధికి కృషి చేస్తా
- కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కృతికా శుక్లా

నరసరావుపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : 'ప్రజా పాలనే నా నినాదం.. ప్రజల సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యం ఇస్తాను.. ప్రజలకు అనుకూలంగా పాలన అందిస్తాను.. జిల్లా అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తాను.' అని జిల్లా నూతన కలెక్టర్ కృతికా శుక్లా స్పష్టం చేశారు. పల్నాడు జిల్లా కలెక్టర్‌గా ఆమె శనివారం బాధ్యతలు స్వీకరించారు. నెల్లూరు జిల్లా కలెక్టర్, భర్త హిమాన్షు శుక్లా.. కొడుకు, కుమార్తె, కుటుంబ సభ్యుల సమక్షంలో కృతికా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీక రించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలకు అందు బాటులో ఉంటానన్నారు. 2016-18లో ఉమ్మడి గుంటూరు జిల్లాకు జాయింట్ కలెక్టర్‌గా పనిచేశానని, అప్పట్లో పల్నాడు ఏరియాలో ఎక్కువగా పర్యటించానని చెప్పారు. ఆ అనుభవం తనకు ఇప్పుడు పనికి వస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పథకాలన్నింటిని సమర్థంగా అమలు చేసి, అధి కారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. జిల్లాలోని సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారిస్తానని కలెక్టర్ తెలిపారు. పల్నాడు జిల్లా కలెక్టర్‌గా నియమించినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.



నెల్లూరు జిల్లా కలెక్టర్, భర్త హిమాన్షు శుక్లా, కుటుంబ సభ్యుల సమక్షంలో జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న కృతికా శుక్లా

సమస్యల పరిష్కార దిశగా అడుగులు

ప్రజా సమస్యలను అర్థం చేసుకోవడంలో అధికారులకు స్పష్టమైన వైఖరి అవసరమని, ప్రతి శాఖలో పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులు, దరఖాస్తులు, కేసులను సమగ్రంగా పరిశీలించి తక్షణ పరిష్కారం చూపాలని కలెక్టర్ కృతికా శుక్లా ఆదేశించారు. జిల్లా ప్రణాళిక పురోగతి అంశాలపై జిల్లా అధికారులతో కలెక్టరేట్‌లో ఆమె సమీక్షించారు. 15, 16 తేదీల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కలెక్టర్ల సమావేశం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ప్రగతి, సంక్షేమ పథకాల అమలు సంబంధించిన అంశాలను సీఎం సమావేశంలో నివేదించేందుకు అధికారుల నుంచి సమాచారం సేకరించారు. అలాగే సమస్యలకు మూల కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కారానికి కృషి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు మూడో వ్యక్తి ద్వారా తన వద్దకు రాకుండా.. ముందుగానే గుర్తించి తగిన పరిష్కార సూచనలతో రావాలని అధికారులకు స్పష్టం చేశారు. సమస్యలు తలెత్తిన తర్వాత చర్యలు తీసుకోవడం కాకుండా, నివారణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు పరిపాలనలో బాధ్యతాయుత ధోరణి కనబరచాలని దిశానిర్దేశం చేశారు. జేసీ సూరజ్ ధనుంజయ్, జిల్లా రెవెన్యూ అధికారి మురళీ, ఆర్డీవోలు, అధికారులు పాల్గొన్నారు.

రైల్వే.. హెల్త్ ఆన్ వీల్స్

- పని ప్రదేశాల్లోనే ఉద్యోగులకు చికిత్స
- గుంటూరు - రేపల్లె, మంగళగిరి మార్గాల్లో ప్రారంభం

గుంటూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగులకు వారు పనిచేస్తోన్న ప్రదేశాల్లోనే వైద్య సేవలందించేందుకు హెల్త్ ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని ఆ శాఖ చేపట్టింది. శనివారం గుంటూరు రైల్వే డివిజనల్ మేనేజర్ సుధేష్ణసేన్ గుంటూరు - రేపల్లె, మంగళగిరి మార్గాల్లో ఈ మెడికల్ రైళ్లను గుంటూరు రైల్వే స్టేషన్‌లో ప్రారంభించారు. ఆయా రైళ్లు ఆయా మార్గాల్లోని అన్ని స్టేషన్లలో ఆగి ఉద్యోగులకు వైద్య సేవలందించాయి. ఈ సందర్భంగా డీఆర్‌ఎం మాట్లాడుతూ డివిజనల్ రైల్వే హాస్పిటల్‌కు చెందిన వైద్య నిపుణులు, లలిత, శంకర్, ఓమెగా వంటి రిఫరల్ ఆస్పత్రుల వైద్య బృందం, పారామెడికల్ సిబ్బంది ఈ హెల్త్ ఆన్ వీల్స్‌లో రైళ్లలో ప్రయాణించి ఉద్యోగులకు ఆరోగ్య పరీక్షలు, నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ మెడికల్ సూపరిం టెండెంట్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసు, ఏడీఆర్‌ఎం రమేష్‌కుమార్, డీఎంవో డాక్టర్ వీ సింధూ, సీనియర్ డీవోఎం జే శ్రీనాథ్, సీనియర్ డీసీఎం డాక్టర్ సీహెచ్ ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.

గుంటూరు - దర్శి సెక్షన్‌లో తనిఖీ

డీఆర్‌ఎం సుధేష్ణసేన్ శనివారం ఉదయం గుంటూరు నుంచి దర్శి రైల్వేస్టేషన్ వరకు తనిఖీ నిర్వహించారు. ప్రత్యేక రైలు ద్వారా ట్రాక్ మొత్తాన్ని, వంతెనల పటిష్ఠతను పరిశీలించారు. గుండ్లకమ్మ, దర్శి రైల్వేస్టేషన్లలో దిగి అక్కడ జరుగుతున్న పనుల నాణ్యతని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ డీఈఎన్ కో-ఆర్డినేటర్ ఆర్ శ్రీనివాసు, సీనియర్ డీవోఎం జే శ్రీనాథ్, సీనియర్ డీఎస్‌టీఈ జీ రత్నాకర్, సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ పాల్గొన్నారు.



గుంటూరు రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరిన హెల్త్ ఆన్ వీల్స్ రైలు

ఎస్పీలు బదిలీ

- గుంటూరు జిల్లా ఎస్పీగా వకుల్‌జిందాల్
- బాపట్లకు ఉమామహేశ్వర్, పల్నాడుకు కృష్ణారావు
- శ్రీ సత్యసాయి, చిత్తూరు జిల్లాలకు సతీష్‌కుమార్, తుషార్ డూడి



ఎస్పీ వకుల్‌జిందాల్



ఎస్పీ కృష్ణారావు



ఎస్పీ ఉమామహేశ్వర్

నరసరావుపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా శనివారం జరిగిన ఐపీఎస్‌ల బదిలీల్లో భాగంగా గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల ఎస్పీలకు స్థానచలనం కలిగింది. ఈ మేరకు డీజీపీ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. గుంటూరు ఎస్పీ సతీష్‌కుమార్‌ను శ్రీసత్యసాయి జిల్లాకు బదిలీ చేసి ఇక్కడ విజయనగరం ఎస్పీ వకుల్‌జిందాల్‌ను నియమించారు. బాపట్ల ఎస్పీ తుషార్‌డూడిని చిత్తూరు జిల్లాకు బదిలీ చేయగా, ఆ స్థానంలో సీఐడీలో విధులు నిర్వహిస్తున్న ఉమామహేశ్వర్‌ని నియమించారు. పల్నాడు ఎస్పీ కంచి శ్రీనివాసరావును బదిలీ చేసి ప్రస్తుతం బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న డీ కృష్ణారావును నియమించారు. గుంటూరు, బాపట్ల ఎస్పీలకు పోస్టింగ్ ఇవ్వగా కంచి శ్రీనివాసరావుకు మాత్రం పోస్టింగ్ ఇవ్వలేదు. కాగా సతీష్‌కుమార్, తుషార్‌డూడి, శ్రీనివాసరావు గత ఏడాది జూలైలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నెల రోజులకు ఎస్పీలుగా ఆయా జిల్లాల్లో నియమితులయ్యారు. కాగా గుంటూరు జిల్లా ఎస్పీగా నియమితులైన వకుల్ జిందాల్ ఆదివారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

పంజాబ్‌వాసి.. గుంటూరుకు

గుంటూరు ఎస్పీగా నియమితులైన వకుల్‌జిందాల్ పంజాబ్ రాష్ట్రానికి చెందినవారు. పంజాబ్‌లోనే ఇంటర్ వరకు చదివారు. తదనంతరం ఐఐటీ డిల్లీలో బీటెక్ కంప్యూటర్స్ పూర్తి చేశారు. ఐపీఎస్ 2016 బ్యాచ్‌కు చెందిన జిందాల్ ఆంధ్రా కేడర్‌కు ఎంపికయ్యారు. ఏఎస్పీగా రంపచోడవరంలో, కృష్ణాజిల్లా ఎస్ఈబీలో ఆ తర్వాత ఎస్పీగా ఉద్యోగోన్నతి పొంది నాటి సీఎం జగన్ సెక్యూరిటీ విభాగంలో పని చేశారు. 2022లో బాపట్ల జిల్లాగా ఏర్పాటయ్యాక తొలి ఎస్పీగా జిందాల్ నియ మితులయ్యారు. గత ఎన్నికల సమయంలో ఆయన బాపట్ల ఎస్పీగా పనిచేశారు. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆయనను విజయనగరం ఎస్పీగా బదిలీ చేసింది.

పల్నాడు జిల్లాకు ఐదో ఎస్పీగా..

పల్నాడు జిల్లాకు ఐదో ఎస్పీగా బీ కృష్ణారావు నియమితులయ్యారు. 2014 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన కృష్ణారావు 2020లో విశాఖపట్నం రూరల్ ఎస్పీగా పనిచేశారు. ఆ సమయంలో వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించి ప్రత్యేక గుర్తింపు పొందారు. అంతకుముందు విశాఖపట్నంలో గ్రేహౌండ్స్ ఓఎస్‌డీగా పని చేశారు. ఏసీబీలో కొంతకాలం ఎస్పీగా పని చేశారు. పులివెందుల ఏఎస్పీగా, అన్నమయ్య జిల్లా ఎస్పీగా పనిచేశారు. మంగళగిరి, నర్సీపట్నం బెటాలియన్లలో విధులు నిర్వహించారు. కాగా 17 నెలల వ్యవధిలో నలుగురు ఎస్పీలు జిల్లా నుంచి బదిలీ కావడం గమనార్హం.

గ్రూప్-1 నుంచి ఎస్పీగా ఉమామహేశ్వర్

బాపట్ల జిల్లా ఎస్పీగా నియమితులైన ఉమామహేశ్వర్ గ్రూప్ వన్‌కు ఎంపికై డీఎస్పీగా పోలీస్ శాఖలో చేరారు. 2024లో ఆయన ఐపీఎస్‌గా ఉద్యోగోన్నతి పొందారు. అంతకు ముందు ఆయన గురజాల, కడప డివిజన్లలో డీఎస్పీగా, అదిలాబాద్, వరంగల్ అర్బన్‌లో అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వహించారు. ఇంటిలిజెన్స్, విజిలెన్స్‌తో పాటు సీఐడీ విభాగంలో ఎస్పీగా పనిచేశారు. ఉమామహేశ్వర్ ఆదివారమే బాధ్యతలు తీసుకోనున్నట్లు సమాచారం. గతేడాది జూలై 17న బాపట్ల జిల్లా ఎస్పీగా తుషార్‌డూడీ బాధ్యతలు తీసుకోగా దాదాపు 14 నెలల పాటు ఇక్కడ సేవలందించారు. సైబర్ నేరాల ఛేదనలో ప్రత్యేక మార్కు కనబరిచారు.

జ్వరంతో చిన్నారి మృతి

ఆవులవారిపాలెంలో వైద్య శిబిరం

క్రోసూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవులవారిపాలెంలో జ్వరంతో గోపు నాగలక్ష్మి(5) అనే బాలిక మృతి చెందినట్లు గ్రామస్థులు తెలిపారు. కొన్ని రోజులుగా జ్వరంతో బాధపడుతున్న చిన్నారి గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించిందన్నారు. జ్వరంతో బాలిక మృతి చెందిన విషయం తెలుసుకున్న స్థానిక ప్రభుత్వ వైద్య బృందం గ్రామాన్ని సందర్శించింది. ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహించింది. అవసరమైతే రక్త నమూనాలను కూడా సేకరిస్తామని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ షాద్ తెలిపారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. చిన్నారి మృతి తర్వాత గ్రామంలో ఇంతవరకు కేసులు నమోదు కాలేదని, అయినా ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నామన్నారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో జీ శ్రీనివాసరావు గ్రామాన్ని సందర్శించి పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. మురుగు కాల్వల్లో ఫాగింగ్ చేయించారు. పరి సరాలను శుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్థులకు సూచించారు.



ఆవులవారిపాలెంలో కొనసాగుతున్న మెడికల్ క్యాంపు

పిడుగుల వాన


- పిడుగుపాటుకు ఐదుగురు మృతి
- పల్నాడులో పలు ప్రాంతాల్లో భారీవర్షం
- రోడ్లపై నిలిచిన నీరు.. రాకపోకలకు అంతరాయం



దాసరి రాణి



సౌరమ్మ



తన్నీరు నాగేంద్రం



దేవరపల్లి సామ్రాజ్యం

బెల్లంకొండ, రొంపిచర్ల, గురజాలటౌన్, పిడుగురాళ్ల, మాచవరం, పెదకాకాని, పెదనందిపాడు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శనివారం మధ్యాహ్నం ఉన్నట్టుండి ఆకాశం మేఘావృతమై చీకట్లు కమ్ముకువచ్చాయి. అంతలోనే ఉరుములు, మెరుపులతో పెద్ద పెట్టున పిడుగులు విరుచుకుపడ్డాయి. పల్నాడుతో పాటు గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు నుంచి భారీవర్షం పడింది. కాగా పిడుగుల కారణంగా పల్నాడు జిల్లాలో ఒకరు, గుంటూరు జిల్లాలో నలుగురు మృతి చెందారు. కాగా భారీ వర్షంతో పలు ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. బెల్లంకొండలో శనివారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో నీరంతా రోడ్డుపై నిలిచింది. నాగిరెడ్డిపాలెం చప్టాపైకి నీరు రావటంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. గురజాలలోని ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. రొంపిచర్ల మండలంలోని పలు గ్రామాల్లో ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. పిడుగురాళ్లలో శనివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. జూలకల్లు చెరువు నుంచి అలుగు తూము ద్వారా నీరు ప్రవహించింది. దాచేపల్లి, మాచవరం, పిడుగురాళ్ల, గురజాల మండలాల్లో కూడా అధిక వర్షం కురవడంతో ప్రధాన రహదారుల్లో వర్షపునీరు నిలిచి రాకపోకలకు అంతరాయం కలిగింది. పత్తి పంటకు వర్షం అనుకూలంగా ఉన్నా కొన్నిచోట్ల వరి పైరు పూర్తిగా నీట మునిగింది. మాచవరంలోని లయోల ప్రేమ నివాసంలోని కొబ్బరి చెట్లపై పిడుగు పడింది. ఆ సమయంలో విద్యార్థులు గదుల్లో ఉండటంతో ప్రమాదం తప్పింది.



వెంకటేశ్వర్లు

పొలం పనుల్లోనే ప్రాణాలు పోయాయి..

శనివారం పలు ప్రాంతాల్లో పిడుగులు పడ్డాయి. వర్షాలతో సాగు పనుల్లో నిమగ్నమైన రైతులు, కూలీలు పిడుగుల ధాటికి బెంబేలెత్తిపోయారు. పెదకాకాని మండలం నంబూరు, పెదనందిపాడు మండలం అన్నపర్రులో పొలం పనులు చేస్తున్న నలుగురు కూలీలు పిడుగుపాటుకు మృతి చెందారు.

● పిడుగురాళ్ల మండలం గుత్తికొండ గ్రామానికి చెందిన దాసుపాటి వెంకటేశ్వర్లు(63) గేదెలతో పొలం వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో అతడి సమీపంలో పిడుగు పడింది. దీంతో అపస్మారక స్థితికి వెళ్లిన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. వెంకటేశ్వర్లుకు భార్య, కుమారులు ఉన్నారు.

● పెదకాకాని మండలం నంబూరులోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన దాసరి సౌరమ్మ (39), దాసరి రాణి(41), పాముల మణి, ఎర్రమోతు మరియమ్మ, దాసరి ప్రేమావతి తదితరులు శనివారం గ్రామ శివారులోని పొలంలో కలుపు తీస్తున్నారు. వర్షం పడటంతో చెట్టు కిందకు వెళ్లారు. అదే సమయంలో పిడుగు పడింది. దీంతో సౌరమ్మ, రాణి అక్కడికక్కడే మృతి చెందారు. మణి, మరియమ్మ, ప్రేమావతిలకు తీవ్రగాయాలు కాగా గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



సత్తెనపల్లి కోర్టు ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

మృతులు సౌరమ్మ, రాణిలు వరసకు తోడికోడళ్లు అవుతారు. ఒకే బజారులో పక్కపక్క ఇళ్లు కావటంతో అంబేద్కర్‌నగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి.

● పెదనందిపాడు మండలం అన్నపర్రు గ్రామానికి చెందిన తన్నీరు నాగేంద్రం(49), దేవరపల్లి సామ్రాజ్యమ్మ(61) గ్రామ శివారులోని పొలాల్లో కూలి పనులకు వెళ్లారు. వర్షంతో ఇంటికి వస్తుండగా చాకలి చెరువు సమీపంలో వారిపై పిడుగు పడింది. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాలను పరిశీలించిన ఇన్‌చార్జి ఎస్ఐ పృథ్వీఏక్‌నాథ్, డీటీ కరిముల్లా వారి వివరాలు నమోదు చేసుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

కోడెల కాంస్య విగ్రహాన్ని రూపుదిద్దిన తెనాలి శిల్పులు


తెనాలి శిల్పులు రూపొందించిన కోడెల విగ్రహం

తెనాలి అర్బన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెనాలి శిల్పులు దివంగత మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాద్ కాంస్య విగ్రహాన్ని రూపుదిద్దారు. సూర్య శిల్పశాలలో ఈ విగ్రహాన్ని తయారు చేసేందుకు వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు కోరారని శిల్పులు కాటూరి వెంకటేశ్వరరావు, రవిచంద్ర తెలిపారు. కోడెల 6వ వర్ధంతిని పురస్కరించుకొని వినుకొండలో విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారని, దీన్ని శనివారం అక్కడకు తరలించామని చెప్పారు. సత్తెనపల్లి, నరసరావుపేట నియోజకవర్గాల్లో కోడెల తనయుడు శివరామ్ ఏర్పాటు చేసిన 50 ఫైబర్ గ్లాసు విగ్రహాలు ఈ శిల్పశాలలోనే రూపొందాయని వెంకటేశ్వరరావు, రవిచంద్ర చెప్పారు.

తెనాలి రైల్వే స్టేషన్‌లో మూడో లైను ఏర్పాటు


నూతనంగా ఏర్పాటు చేసిన మూడో రైల్వే లైను

తెనాలి అర్బన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెనాలి రైల్వే స్టేషన్‌లో రెండవ ప్లాట్‌ఫాంలో మూడో రైల్వే లైను వేశారు. ప్లాట్‌ఫాంకు రెండు వైపులా చివర ఉన్న పాత క్యాబిన్‌లను ఆధునీకరణలో భాగంగా ఇటీవల తొలగించారు. క్యాబిన్‌ల తొలగింపు వల్ల ఏర్పడిన స్థలం గుండా మూడో లైనును ఏర్పాటు చేశారు. కృష్ణాకెనాల్ జంక్షన్ నుంచి గూడూరు వరకు ఈ లైనును ఏర్పాటు చేశారు. దాంతో లైన్ సామర్థ్యం పెరిగి ఎక్కువ రైళ్లను పంపే అవకాశం కలిగింది. ఈ లైన్‌లో స్పీడ్ టెస్టును సోమవారం నిర్వహించనున్నారు. స్పీడ్ టెస్ట్ నేపథ్యంలో ప్రయాణికులు లైను ద్వారా రాకపోకలు సాగించవద్దని, ముఖ్యంగా పశువుల పెంపకందారులు ఈ విషయాన్ని గమనించాలని రైల్వే అధికారులు కోరారు.

పారిశుధ్య సమస్యలు ఎందుకు పరిష్కరించట్లేదు..?

● అధికారులను నిలదీసిన డాక్టర్ పెమ్మసాని ● ప్రభుత్వాసుపత్రిలో కేంద్ర మంత్రి ఆకస్మిక తనిఖీలు


ప్రభుత్వాసుపత్రిలో పర్యటిస్తున్న మంత్రి పెమ్మసాని, ఎమ్మెల్యే నసీర్

గుంటూరు మెడికల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రిలో పారిశుధ్య సమస్యలు తరచూ ఎందుకు కనిపిస్తున్నాయని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ ఆసుపత్రి సిబ్బందిని నిలదీశారు. చిన్న చిన్న ట్యాంకర్లు ఏర్పాటు చేసుకుంటే మరుగుదొడ్ల దగ్గర ఇబ్బంది ఉండదు కదా అని ఆయన వారికి సూచించారు. గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో శనివారం పెమ్మ సాని ఆకస్మిక తనిఖీలు చేశారు. కేంద్ర మంత్రి వెంట గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్, డిప్యూటీ మేయర్ షేక్ సజీల తదితరులు పాల్గొన్నారు. మంత్రి పెమ్మసాని చికిత్స కోసం వచ్చిన వారిని నేరుగా కలుసుకొని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో సౌకర్యాలను, వివిధ వైద్య పరికరాలు, వైద్యుల పనితీరు తదితర ఏర్పాట్లపై రోగుల నుంచి అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రోగులు ఆసుపత్రిలో పారిశుధ్య సమస్యలు, మరుగుదొడ్లలో ఇబ్బం దులు ఉన్నట్లు ఆయన దృష్టికి తెచ్చారు. సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వితో పాటు శానిటరీ సిబ్బందిని వెంటనే పిలిపించిన మంత్రి పెమ్మసాని సమస్యలకు తగిన పరిష్కారాలను వివరించారు. బకాయి నిధులు రాకపోవడంతో కొన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయలేక పోతున్నట్లు శానిటరీ అధికారుల వివరణ ఇవ్వగా, బకాయిలను వెంటనే తెప్పించాలని అధికా రులను పెమ్మసాని ఆదేశించారు. తాను కూడా ఈ విషయంపై దృష్టి పెట్టి పెండింగ్ బిల్లులను తెప్పించేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. అనంతరం ఓపీ, ఐసీయు, ఎమర్జెన్సీ, వార్డులను పరిశీలించారు. ఇటీ వలే తురకపాలెంలో ఆరోగ్య సమస్యలతో జీజీహెచ్‌లో చేరిన బాధితులను కలిసి ఆయన పరామర్శించారు. వారికి అందుతున్న చికిత్సలను అడిగి తెలుసుకున్నారు. స్వతహాగా డాక్టర్ అయిన కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రోగుల చికిత్సల్లో వైద్య సిబ్బందికి పలు సలహాలు, సూచనలు అందజేశారు.

రాజ్యాంగ హక్కులను రక్షిస్తున్న కూటమి ప్రభుత్వం

ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ

జగన్‌కు, చంద్రబాబుకు చాలా వ్యత్యాసం ఉందంటూ వ్యాఖ్యలు


మాట్లాడుతున్న కేఆర్ సూర్యనారాయణ, పాల్గొన్న సంఘ నేతలు

గుంటూరు (తూర్పు), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తమ సంఘాల గుర్తింపు రద్దు చేస్తామని గత వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన నోటీసులను కూటమి ప్రభుత్వం ఉపసంహరించు కోవడంపై సీఎం చంద్రబాబుకు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. గుంటూరు కలెక్టరేట్ రోడ్డులో ఏర్పాటు చేసిన జిల్లా సంఘ కార్యాలయ ప్రారంభోత్సవంలో ఆయన మాటాడుతూ, ప్రతి నెలా 1వ తేదీన జీతం చెల్లించమంటే తమను అరెస్టు చేయించిన జగన్‌కు, నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని చెప్పిన చంద్రబాబుకు చాలా వ్యత్యాసం ఉందని అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు రావాల్సిన బకాయిల కోసం అప్పట్లో గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తే, గత వైసీపీ ప్రభుత్వం తనను, తన కుటుంబసభ్యులను తీవ్రంగా వేధించిందని ఆరోపించారు. అయితే ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు తమ సమస్యలను విని సానుకూలంగా స్పందిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. రాజ్యాంగ హక్కులను ఆయన రక్షిస్తున్నారని అభినందించారు. గత ప్రభుత్వం పెట్టిన బకాయిలకు సంబంధించి నిధులు లేకపోతే, ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీని కోసం వర్కింగ్ కమిటీని ఏర్పాటు చేయాలని ఆయన్ను కోరామని చెప్పారు. 12వ వేతన సవరణ కమిటీ, ఇతర సమస్యలపై కూటమి ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందని తెలిపారు. ఈ సందర్భంగా తమ సంఘానికి ప్రతి జిల్లాలో కార్యాలయాలు ఏర్పాటు చేసుకునేలా ఆదేశాలు ఇచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కేఆర్ సూర్యనారాయణ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి రమేశ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా, కేవీఎస్ శివారెడ్డి, అబ్దుల్ రజాక్, లక్ష్మీనారాయణ, హేమలత, సుమిత్రాదేవి తదితరులు పాల్గొన్నారు.

గుంటూరు రైల్వేస్టేషన్ నూతన మేనేజర్‌గా శరత్‌బాబు



గుంటూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వేస్టేషన్ నూతన మేనేజర్‌గా మండే శరత్‌బాబు నియమితులయ్యారు. శనివారం ఆయన రైల్వే స్టేషన్‌కు చేరుకొని బాధ్యతలు చేపట్టారు. శరత్‌బాబు ఇప్పటివరకు గుంటూరు రైల్వే ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై స్టేషన్ మేనేజర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా స్టేషన్ సూపరింటెండెంట్ కంతేటి చంద్రకిరణ్, సిబ్బంది సీరం అనీల్‌కుమార్, డీ రాజ్‌కుమార్, షేక్ ఖాదర్‌బాషా తదితరులు శరత్‌బాబుకు అభినందనలు తెలియజేశారు.

విద్యుత్‌శాఖలో ఉద్యోగుల విభజన పూర్తి

● పలువురు జూనియర్‌లకు స్థాన చలనాలు

● ఆప్షన్లకు అనుగుణంగా విభజన

గుంటూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ కసరత్తు తరువాత ఏపీ సీపీడీసీఎల్ పరిధిలోని సర్కిల్స్‌కు ఉద్యోగుల విభజన ప్రక్రియ పూర్తయింది. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో విస్తరించిన సీపీడీసీఎల్ సర్కిల్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కార్యాలయాలకు ఉద్యోగులను కేటాయిస్తూ సీఎండీ పుల్లారెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధానంగా పలువురు జూనియర్ ఉద్యోగులకు స్థాన చలనాలు కల్పించారు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో కొత్తగా ఏర్పాటు చేసిన సర్కిల్స్‌కు ఉద్యోగులను కేటాయించేందుకు అధికారులు ఎన్నో కసరత్తులు చేశారు. కొత్తగా సర్కిల్స్ విభజన చేసినప్పటికీ అందుకు అనుగుణంగా ఉద్యోగులు లేక కార్యాలయాల్లో కూడా పరిపాలన నత్తనడకన సాగుతుందన్న విమర్శలు వచ్చాయి. మధ్యలో సర్కిల్స్‌కు కొత్తగా మార్పులు, చేర్పులు చేయటంతో ఉద్యోగుల విభజనలో కొంత జాప్యం జరిగినట్లు అధికారులు చెబుతున్నారు. ఉద్యోగుల విభజన ప్రక్రియ ఎంతో కాలంగా పెండింగ్ పడుతూనే వస్తోంది. కొన్ని నెలలుగా పూర్తిస్థాయిలో కసరత్తు చేసిన ఉన్నతాధికారులు చివరకు విభజన ప్రక్రియను పూర్తి చేశారు. విభజన కోసం ఉద్యోగుల నుంచి ఆప్షన్స్ స్వీకరించారు. వారి ఆప్షన్స్‌కు అనుగుణంగా ఉద్యోగులను సర్కిల్స్‌కు విభజించారు. జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్ (జేఏవో) నుంచి అటెండర్ స్థాయి ఉద్యోగుల వరకు స్థాన చలనాలు లభించిన వారిలో ఉన్నారు. గుంటూరు సర్కిల్ నుంచి అత్యధిక శాతం మందికి పల్నాడు, మిగతా వారికి బాపట్ల సర్కిల్‌కు బదిలీ చేసినట్లు ఆ శాఖ వర్గాలు తెలిపాయి.

చేబ్రోలు మండలంలో మెలియాయిడోసిస్ కలకలం..!

● వదంతులు నమ్మవద్దన్న వైద్యాధికారులు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి ఊర్మిళ

చేబ్రోలు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు మండలంలోని కొత్తరెడ్డిపాలెం గ్రామంలో గత కొన్నిరోజులుగా స్థానికులు తీవ్ర జ్వరాలతో బాధపడుతున్నారు. ప్రతి 10 కుటుంబాలలో ఒకరికి జ్వరలక్షణాలు ఉండటంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో చనిపోయిన ఒకరికి మెలియాయిడోసిస్ వచ్చిందంటూ ప్రచారం జరిగింది. ఈ వార్త విస్తృతంగా ప్రచారమవడంతో జ్వరాలతో బాధపడుతున్నవారు ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు పెడుతున్నారు. క్రమేపీ జ్వరాల సంఖ్య పెరగటంతో చేబ్రోలు ప్రాథమిక వైద్యాధికారులు ఇంటింటి సర్వే నిర్వహించారు. అనంతరం జ్వరంతో బాధపడుతున్న వారిలో అనుమాన లక్షణాలున్న 9 మందికి రక్త పరీక్షలు చేశారు. వారిలో 5గురికి పాజిటివ్ రాగా నలుగురికి నెగిటివ్ వచ్చింది. పాజిటివ్ వచ్చిన 5 గురిలో ఇన్ఫెక్షన్‌కు కారణమైన స్టాఫిలోకోకస్ బాక్టీరియా ఉన్నట్లు రిపోర్టులు వచ్చాయన్నారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ప్రాథమిక వైద్యాధికారి ఊర్మిళ మాట్లాడుతూ, స్టాఫిలోకోకస్ సోకిన వారికి యాంటీబయాటిక్ మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. శుక్రవారం చనిపోయిన ఆశా వర్కర్ సులోచనకు ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ ఉందని చెప్పారు. కొత్తరెడ్డిపాలెంలో ప్రజలు వదంతులు నమ్మవద్దని, వైద్యాధికారులు, ఏఎన్ఎంలు నిరంతరం గ్రామంలో పర్యవేక్షిస్తున్నారని వైద్యాధికారి ఊర్మిళ తెలిపారు.

ఖనిజ లవణాలతో నీటిని అందించాలి

● రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, విశ్రాంత చీఫ్ ఇంజనీర్ తోట ప్రభాకరరావు


చిలువూరులో రక్షిత మంచినీటి సరఫరాను పరిశీలించేందుకు వచ్చిన ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ల బృందం

దుగ్గిరాల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ఖనిజ లవణాలతో కూడిన తాగునీటిని అందించాలని, రక్షిత మంచి నీటి సరఫరా ట్యాంకులను జల దేవాలయాలుగా తీర్చిదిద్దాలని రాష్ట్రప్రభుత్వ సలహాదారుడు, విశ్రాంత చీఫ్ ఇంజనీర్ తోట ప్రభాకరరావు అన్నారు. చిలువూరులో రక్షిత మంచినీటి సరఫరా తీరును రాష్ట్రంలో ప లు జిల్లాల నుంచి వచ్చిన 14 మందితో కూడిన ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు, ఏఈల బృందం శనివారం పరిశీలించింది. తొలుత చిలువూరు గ్రామా నికి నీటిని సరఫరా చేసే పంపు హౌస్‌ను, ఓవర్‌హెడ్ ట్యాంకును పరిశీ లించి, క్లోరినేషన్ చేస్తున్న విధానం గురించి స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్యం, వాల్‌పిట్స్, పైపుల ద్వారా ఏ పరిమాణం లో నీటిని అందిస్తున్నారు.. నీటి సరఫరా కుళాయిల ద్వారా జరుగు తుందా, క్లోరినేషన్ చేసిన నీరు చివరి వరకూ వెళుతుందా అన్న అంశాలను కూడా అడిగి తెలుసుకున్నారు. రిపేర్లున్న లైన్ల గురించి తెలుసు కొని వాటిని సరిదిద్దాలని సిబ్బందికి సూచించారు. అనంతరం రాష్ట్రప్ర భుత్వ సలహాదారుడు, విశ్రాంత చీఫ్ ఇంజనీరు తోట ప్రభాకరరావు మాట్లాడుతూ, క్లోరినేషన్ ద్వారా నీటిలో ఉన్న కంటికి కనబడని బ్యాక్టీరియాను నిర్మూలించవచ్చని, తద్వారా ప్రజలు వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చని అన్నారు. ఆర్ఓ నీటి వినియోగంతో ప్రజలు కీళ్ల వ్యాధుల బారిన పడుతున్నారని, దీన్ని నివారించేందుకు ఖనిజ లవణాలతో కూడిన నీటిని వారికి అందించాలని చెప్పారు. రక్షిత మంచినీటిని సరఫరా చేసే ట్యాంకులను జల దేవాలయాలుగా తీర్చిదిద్దాలని ఆయన సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిలువూరు మాణిక్యం, ఎంపీటీసీ రోజా మరియమ్మ, డిప్యూటీ ఎంపీడీఓ జవహ ర్‌లాల్, పంచాయతీ కార్యదర్శి శరత్, పలువురు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కార్యాచరణ

నాలుగో తరగతి సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రత్నకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రత్నకుమార్

గుంటూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కార్యాచరణను రూపొందించనున్నట్లు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు జి.రత్నకుమార్ తెలిపారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల రాష్ట్ర సంఘ కార్యవర్గ సమావేశం శనివారం జిల్లా పరిషత్‌లోని పంచాయతీ రాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘ భవనంలో జరిగింది. ఈ సమావేశానికి అన్ని జిల్లాల కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘానికి సంబంధించిన పలు సమస్యలపై చర్చించారు. సంఘంలోని ఉద్యోగుల సమస్యలు, వారికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న బకాయిల గురించి చర్చించి పరిష్కార మార్గాలపై కార్యాచరణను రూపొందించాలని నిర్ణయించారు. ప్రమోషన్లు, సీనియారిటీ లిస్టు తదితర విషయాలలో నాలుగో తరగతి ఉద్యోగులపై చిన్న చూపు తగదని, మిగతా క్యాడర్‌లలో ఇస్తున్న మాదిరిగానే తమకూ ప్రమోషన్లు ఇవ్వాలని విన్నవించారు. రాష్ట్ర సంఘంతో పాటు, ఆయా జిల్లాల సంఘాలలో పదవీ విరమణ చేసిన నాయకుల స్థానంలో తిరిగి సభ్యులను ఎన్నుకోవాలని తీర్మానించారు. నాలుగో తరగతి ఉద్యోగులకు వారికి సంబంధించిన పనులే గాక ఊడ్చే పనులు, నైట్ వాచ్‌మెన్ డ్యూటీలు చేయిస్తున్నారని, అధికారులు ఈ విషయంపై దృష్టి సారించి న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ నాలుగో తరగతి ఉద్యోగుల రాష్ట్ర సంఘ అధ్యక్షుడు జి. రత్న కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ రాజేశ్ ప్రభు కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ లచ్చన్న, ప్రసాద్, తిప్పే స్వామి, వివిధ జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

మిగులు జలాలపై తెలంగాణది అనవసర రాద్ధాంతం

● ఏపీ విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు

గుంటూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మిగులు జలాలపై తెలంగాణ ప్రభుత్వం అనవసర రాద్ధాంతం చేస్తోందని విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు ఆక్షేపించారు. శనివారం గుంటూరులోని బాలానంద కేంద్రంలో ఆలోచనాపరుల వేదిక ఆధ్వర్యంలో నదీ జలాల హక్కుల పరిరక్షణ, నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణంపై సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఏబీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, మిగులు జలాలు వాడుకొనే హక్కు చివరి రాష్ట్రం అయిన ఏపీకి ఉందని అన్నారు. ఒక బేసిన్ నుంచి మరో బేసిన్‌కు నీటిని తరలించుకోవచ్చని చెప్పారు. ఈ విషయాలన్నీ బచావత్ ట్రిబ్యునల్ గతంలోనే స్పష్టం చేసిందని తెలిపారు. అయినప్పటికీ మిగులు జలాలపై తెలంగాణ ప్రభుత్వం అసత్య ప్రచారం చేస్తోందని విమర్శించారు. అంతేకాకుండా కృష్ణా, గోదావరి నదులపై అనుమతులు లేని ప్రాజెక్టులు నిర్మిస్తోందని ఆరోపించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అధికంగా హైదరాబాద్‌లోనే అభివృద్ధి కోసం నిధులను వెచ్చించడం జరిగిందని చెప్పారు. గత 40 ఏళ్లలో ఒక్క భారీ ప్రాజెక్టు కూడా కోస్తాంధ్రకు రాలేదని అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం దశాబ్దాలుగా జరుగుతూనే ఉందని చెప్పారు. రైతుల అవసరాల కోసమే ప్రాజెక్టుల డిజైన్లు, నిర్మాణం జరగాలని వెంకటేశ్వరరావు ఆకాంక్షించారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.45 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	139. 150. 157
చికెన్ విత్ స్కిన్(కిలో)	264.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	274.00

పాల ఉత్పత్తిదారులకు బోనస్ పంపిణీ

సత్తెనపల్లి రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెంటపాళ్ల బీఎంసీ పరిధిలోని గుజ్జర్లపూడి సంగం డెయిరీ పాల కేంద్రంలో పాల ఉత్పత్తిదారులకు బోనస్ శనివారం పంపిణీ చేశారు. రూ.2,95,336 నగదును డెయిరీ డైరెక్టర్ పోపూరి శేషగిరి కుమారి అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ షట్టా శివపార్వతి, బీఎంసీ మేనేజర్ గోపీ, సూపర్‌వైజర్ కోటేశ్వరరావు, వీరయ్య పాల్గొన్నారు.

రేపు సురవరం సంస్మరణ సభ

మాచర్ల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో సోమవారం సీపీఐ అగ్రనేత, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి సంస్మరణ సభ జరుగుతుందని సీపీఐ మాచర్ల ఏరియా కార్యదర్శి మేకపోతుల శ్రీనివాసరెడ్డి శనివారం తెలిపారు. కార్మికులు, విద్యావంతులు, న్యాయవాదులు, ప్రజాసంఘాలు తరలిరావాలని కోరారు.

ఉచిత కంటి వైద్య శిబిరం...

దుర్గి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): అడిగొప్పల ఎస్సీ కాలనీ ఇమ్మానియేలు లూథరన్ దేవాలయంలో సోమవారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నారు. మాచర్ల జడ్జన్ జ్ఞానశర్మ ఆయన కుటుంబ సభ్యులు ఈ శిబిరం ఏర్పాటు చేస్తున్నారు.

300 మందికి అన్నప్రసాదం పంపిణీ

కారంపూడి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కారంపూడిలోని ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో శనివారం శ్రీవాసవీ అన్న ప్రసాద కమిటీ ఆధ్వర్యాన 300 మందికి అన్నదానం నిర్వహించారు. శ్రీవాసవీ ఆటో అండ్ ఎంప్లాయీస్ ఫైనాన్స్ ప్రతినిధి యేచూరి సాంబశివరావు, పద్మావతి దంపతులు, సాయి అవినాష్, జ్యోతి దంపతులు, జోషిత ఈ సేవా కార్యక్రమానికి సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో కమిటీ వ్యవస్థాపకుడు భవిరిశెట్టి రామారావు, కఠలపాటి శ్రీనివాసరావు, చిన్ని లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించాలి

● రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణారావు

మాచర్ల రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్ల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణారావు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ హాలులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పీఆర్సీ కమిషన్ వేసి ఐఆర్ బకాయిలను చెల్లించాలన్నారు. అనంతరం 80వ సంవత్సరంలో అడుగుపెట్టిన్న గౌరవ సలహాదారు చంద్రమౌళి రామనాథశర్మ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి చంద్రయ్య, ట్రెజరర్ గాలిబ్ సాహెబ్, సెక్రటరీ గౌస్, అంజయ్య, రామారావు, నారాయణ, జాన్‌సాహెబ్, మాబు, పాపిరెడ్డి, నాగేశ్వరరావు, నాగిరెడ్డి, కిరీటిరెడ్డి, బాష్యకరబాబు, నాగార్జునరాజు, కృష్ణకుమారి, సుజాత, శివపార్వతి పాల్గొన్నారు.

పులిచింతల సమాచారం

అచ్చంపేట, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శనివారం 41.83 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్లు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగువ నుంచి 2,00,630 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టుకు చేరుతుంది. ప్రాజెక్టు పవర్ జనరేషన్ ద్వారా 16,600, లీకుల ద్వారా 400, ఎంపిగేట్ల ద్వారా 1,18,683, మొత్తం 1,35,683 క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

సాంబయ్య మృతి పార్టీకి తీరని లోటు

బెల్లంకొండ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పాపాయపాలెం గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు చందగల సాంబయ్య మృతి పార్టీకి తీరని లోటని మాజీ సర్పంచ్ సింగారెడ్డి బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. శనివారం గ్రామంలో మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రేపు ఆధార్ ప్రత్యేక శిబిరం

సత్తెనపల్లి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రావు చెంద్ర బాల కుటీర్‌లో సోమవారం ప్రత్యేక ఆధార్ శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ప్రిన్సిపాల్ గీతాంజలి శనివారం విలేకరులకు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 98861 65117 నంబరుకు సంప్రదించాలన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

మాచవరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోర్జంపాడు గ్రామంలో బాధిత కుటుంబానికి శనివారం టీడీపీ నాయకులు రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. పార్టీ నాయకురాలు బాణావత్ సాంబాబాయి(55) అనారోగ్యంతో మృతిచెందడంతో.. అంత్యక్రియల నిమిత్తం నగదు అందజేశారు.

ఎత్తిపోతల అభివృద్ధికి చర్యలు

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి


సీసీ రోడ్ల నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

విజయపురిసౌత్, వెల్దుర్తి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పర్యాటక కేంద్రమైన ఎత్తిపోతల అభివృద్ధికి చర్యలు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం ఎత్తిపోతలను ఆయన సందర్శించి వసతులను పరిశీలించారు. ఎత్తిపోతలను సందర్శించే పర్యాటకులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని టూరిజం ఉద్యోగులకు సూచించారు. పంగులూరి పుల్లయ్య, టీడీపీ నేతలు ఉన్నారు.

నిర్మాణ పనుల పరిశీలన

వెల్దుర్తిలో రూ. 85 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, డ్రైనేజ్ పనులను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పరిశీలించారు. రామాలయం వీధి, చెంచుకాలనీ, శివాలయం బజారు, కుమ్మరి బజారులలో జరుగుతున్న పనులను సందర్శించారు. మండలం పరిధిలోని గ్రామాలకు సీసీ రోడ్ల కోసం రూ.3.20 కోట్ల నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. అలాగే ఉప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో నూతనంగా నిర్మిస్తున్న పబ్లిక్ హెల్త్ క్లినిక్ నిర్మాణ పనులనుఎమ్మెల్యే జూలకంటి పరిశీలించారు. రూ. 50 లక్షలతో ఏర్పాటు చేస్తున్న ఈ క్లినిక్ మండల ప్రజలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు.

రూ.4.50 కోట్లతో వెంకటాయపాలెం తారు రోడ్డు


బెల్లంకొండ నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

బెల్లంకొండ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాయపాలెం రోడ్డు నిర్మాణానికి రూ.4.50 కోట్లు నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. శనివారం బెల్లంకొండ టీడీపీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, వెంకటాయపాలెం సర్పంచ్ శ్రీను నాయక్, టీడీపీ నాయకులతో గుంటూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో వెంకటాయపాలెం రోడ్డుపై తట్ట మట్టి కూడా వేయలేదన్నారు. అప్పటి ఎమ్మెల్యే ఇక్కడ రోడ్డు వేయించి, వెంకటాయపాలెం గ్రామానికి వస్తానని హామీ ఇచ్చి మాట తప్పారని విమర్శించారు. రెండు దశాబ్దాలుగా రోడ్డు లేక ఇబ్బందులు పడుతున్న రామాంజనేయపురం, వెంకటాయపాలెం గ్రామాలకు బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులను మంజూరు చేయటంతో అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మరోసారి నిరూపించామని ఎమ్మెల్యే తెలిపారు. బెల్లంకొండ నుంచి రామాంజనేయపురం మీదుగా వెంకటాయపాలెం వరకు తొమ్మిది కిలో మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి ఎన్‌డీబీజీపీ నిధులు మంజూరైనట్లు తెలిపారు. రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించినందుకు ఎమ్మెల్యే ప్రవీణ్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సర్పంచ్ మేకం శ్రీరామమూర్తి, మేకం యలమంద, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జోరు వర్షం..రోడ్లు జలమయం


బెల్లంకొండ మెయిన్ సెంటర్‌లో నిలిచిన వర్షపు నీరు


మాచర్ల: గుంటూరు - మాచర్ల రహదారిలో వర్షపు నీరు


పిడుగురాళ్ల ప్రధాన రహదారిలో నిలిచిన వర్షపునీరు

సత్తెనపల్లి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షం కురిసింది. పట్టణంలో వర్షపునీరు రహదారులపై ప్రవాహం ఉంది. కోర్టు ఆవరణలో వర్షపునీరు నిలిచిపోయింది. రెండు గంటలకు పైగా విద్యుత్ సరఫరా ఆగిపోయింది.

● సత్తెనపల్లి రూరల్: మండలంలో శనివారం మధ్యాహ్నం నుంచి భారీవర్షం కురిసింది. సుమారు మూడు గంటల పాటు కురిసిన వర్షానికి అన్నదాతల హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత పది రోజులుగా విపరీతమైన ఎండ, వేడి గాలులకు పత్తి, మిరప మొక్కల ఎదుగుదల లోపించాయి. వర్షం పంటలకు జీవం పోసినట్లైనని రైతులు తెలుపుతున్నారు.

● బెల్లంకొండ: బెల్లంకొండలో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గ్రామంలో డ్రైనేజీ సక్రమంగా లేకపోవటంతో వర్షపు నీరు, మురుగు నీరు రోడ్డుపై నిలిచిపోయింది. భారీ వర్షానికి ఎస్సీ కాలనీ జలమయమైంది. జడ్పీ హైస్కూల్, తహసీల్దార్ కార్యాలయ ఆవరణ వర్షపు నీటితో నిండిపోయింది. నాగిరెడ్డిపాలెం చప్టాపైకి నీరు రావడంతో ఆ మార్గంలో రాకపోకలకు అంతరాయం కలిగింది.

● గురజాల టౌన్: గురజాల పట్టణంలో శనివారం సాయంత్రం కురిసిన వర్షానికి పట్టణంలోని ప్రధానరహదారులు జలమయమయ్యాయి. ఎక్సైజ్ కార్యాలయం చుట్టూ వర్షపునీరు నిలిచింది. పట్టణంలోని లక్ష్మి టాకీస్ సెంటర్లో గుంటూరు - మాచర్ల ప్రధాన రహదారిపైకి భారీగా వర్షపు నీరు చేరింది.

● పిడుగురాళ్ల: పల్నాడు ప్రాంతంలో శనివారం భారీ వర్షం కురిసింది. పట్టణంలోని ప్రధానరహదారిలో వర్షపునీరు ప్రవహించింది. డ్రైనేజ్ వ్యవస్థ తెల్ల చెదారంతో నిండి వర్షపునీరు రోడ్డుపై పారింది. జూలకల్లు, గుత్తికొండ, పందిటివారిపాలెం, జానపాడు ప్రాంతాల్లో వర్షపు నీట మునిగింది. జూలకల్లు చెరువునుంచి అలుగు తూము ద్వారా నీరుఅధికంగా బయటకు వచ్చింది.

డాక్టర్ రమేష్, చైతన్యల సేవలు అభినందనీయం

పెదకూరపాడు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సివిల్‌సర్జన్లుగా పదోన్నతిపై వెళ్తున్న డాక్టర్ రమేష్, చైతన్య సేవలు మరువలేనివని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ విద్య అన్నారు. శనివారం పెదకూరపాడు సీహెచ్‌సీలో బాధ్యతలు నిర్వహిస్తూ పదోన్నతిపై వెళ్తున్న రమేష్, చైతన్యలను ఆస్పత్రి సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్లు అశోక్ రెడ్డి, జాన్ కోషి లక్ష్మీరాజ్యం పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరీ ఆలయంలో వామనాశ్రమ పీఠాధిపతి

అమరావతి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి) కర్ణాటకలోని హళిహూర్ వారణాసి వామనాశ్రమం వైశ్యమతాధిపతి మహాస్వామి శనివారం స్థానిక కన్యకాపరమేశ్వరీ ఆలయాన్ని సందర్శించారు. అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం వేదపాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు.

గుంతలమయంగా మాచర్ల ప్రధాన రహదారి


గుంతలతో మాచర్ల - గుంటూరు ఆర్‌అండ్‌బీ రహదారి

రెంటచింతల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మాచర్ల-గుంటూరు ప్రధాన రహదారి గోతులమయంగా మారటంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఐటీఐ సమీపంలో కురిసిన వర్షాలకు రోడ్డంతా గుంతలమయమైంది. ప్రధానంగా లూథరన్ చర్చి ఎదురుగా అడుగడుగునా గుంతలతో అధ్వానంగా ఉంది. ఈ రహదారిపై ద్విచక్ర వాహనంపై వెళ్తున్న భార్యభర్తలు ఐటీఐ వద్ద అదుపుతప్పి కిందపడి గాయపడ్డారు. గోతుల పూడ్చివేతకు అధికారులు చర్యలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ఈ రహదారి నిర్మాణానికి రూ.16కోట్లు కేటాయించారు. పనులు ప్రారంభించకపోవటంపై పలువురు ప్రశ్నిస్తున్నారు.

రాజీ మార్గమే.. రాజ మార్గం


పిడుగురాళ్ల: లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న న్యాయాధికారి వై.శ్రీనివాసరావు


సత్తెనపల్లి: లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న సీనియర్ న్యాయాధికారి వి.విజయ కుమార్‌రెడ్డి

సత్తెనపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాజీ మార్గమే రాజ మార్గమని సీనియర్ సివిల్ జడ్జి వి.విజయకుమార్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో జరిగిన లోక్ అదాలత్‌లో ఆయన పాల్గొన్నారు. పట్టణంలోని నాలుగు న్యాయ స్థానాల్లో ఉన్న పలు కేసులను మూడు బెంచ్‌లుగా లోక్ అదాలత్‌లో పరిష్కరించారు. సివిల్ జడ్జి కౌషిక్ హుస్సేన్, రెండవ అదనపు సివిల్ జడ్జి జె.సుజిత్ కుమార్, పలువురు న్యాయవాదులు, బ్యాంక్ మేనేజర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

226 కేసుల పరిష్కారం

మాచర్ల రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో మండల న్యాయ సేవా కమిటీ అధ్యర్యాన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. న్యాయమూర్తి శ్రీనివాస కల్యాణ్, పీడీఎం న్యాయవాది ఏడుకొండలు 226 కేసులను పరిష్కరించారు. వీటిలో క్రిమినల్ 47, ఎన్‌ఐయాక్ట్ 9, భరణం 4, ఎక్సైజ్ 20, ఈపీ 22, సివిల్ 9, ఎస్టీయా 108, పీఎల్‌సీ 2, ఇతర కేసులు మూడు ఉన్నాయి.

183 కేసులకు పరిష్కారం

గురజాల లీగల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గురజాల కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం న్యాయాధికారి వై.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. ఇందులో 29 సివిల్, 143 క్రిమినల్, 11 కుటుంబ సమస్యల కేసులు పరిష్కరించినట్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోట శ్రీనివాసరావు, ఏపీపీ కందిమళ్ల సూర్యారావు తెలిపారు. కలివెల ప్రభుదాను, చల్లా రామిరెడ్డి, ఎ శ్రీనివాసరావు, చెన్నకేశవరావు, నాగమణి పాల్గొన్నారు.


మాచర్ల: లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తి శ్రీనివాస కల్యాణ్

మంత్రి లోకేశ్ కృషి భేష్


మాట్లాడుతున్న చేర్పేడి మంజులారెడ్డి

● శిల్పారామం చైర్ పర్సన్ మంజులారెడ్డి

రెంటచింతల,సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నేపాల్ మారణ హోమంలో చిక్కుకున్న తెలుగువారిని స్వస్థలాలకు తరలించడంలో రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కృషి ప్రశంసనీయమని శిల్పారామం చైర్‌పర్సన్ చేర్పేడి మంజులారెడ్డి అన్నారు. తెలుగు వారు ఆపదలో ఉన్నారంటే.. తక్షణం స్పందించే ఏకైక పార్టీ టీడీపీ అని శనివారం ఆమె పేర్కొన్నారు. మంత్రి లోకేశ్ మానవతా దృక్పథంతో స్పందించి ప్రత్యేక విమానంలో స్వస్థలాలకు రప్పించారన్నారు. ఈ సమావేశంలో మాలి రాయపరెడ్డి, కొత్త అంజి, అప్పయ్య, కొత్త గోపాలరావు, సుంకయ్య, శివయ్య తదితరులున్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


సాంబయ్య (ఫైల్‌ఫోటో)

గురజాలటౌన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో వ్యక్తి మృతిచెందిన ఘటన పట్టణంలోని రెడ్డిబండ సెంటర్లో శుక్రవారం రాత్రి జరిగింది. లింగా సాంబయ్య (55) శుక్రవారం రాత్రి స్నానం చేసేందుకు మరుగుదొడ్డికి వెళ్లాడు. వాటర్ హీటర్ ఆన్ చేసే సమయంలో ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. కుటుంబసభ్యులు పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

దాచేపల్లి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేస్తున్న యువకుడిని లారీ ఢీకొనడంతో మృతి చెందిన ఘటన శనివారం దాచేపల్లి నగర పంచాయతీలోని నడికుడి వ్యవసాయ మార్కెట్ సమీపంలో జరిగింది. మృతుడు నారాయణపురంలోని ఎంఎస్‌పేటకు చెందిన వంగా సుకుమార్(22)గా గుర్తించారు. సుకుమార్ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు.

కొబ్బరి చెట్టుపై పిడుగు


పిడుగు పడటంతో కాలుతున్న కొబ్బరి చెట్టు

మాచవరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మాచవరంలో శనివారం కొబ్బరి చెట్టుపై పిడుగు పడింది. లయోల ప్రేమ నివాసంలోని కొబ్బరి కొబ్బరి చెట్టు తలపై మంటలు చెలరేగాయి. విషయం తెలుసుకున్న తహసీల్దార్ మునా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. సిస్టర్ కవితతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

క్రోసూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హసానాబాద్‌లో శనివారం సాయంత్రం విద్యుదాఘాతంతో షేక్ కందిపాటి నాగుల్ మీరాకు చెందిన ఎద్దు మృతి చెందింది. దీని విలువ లక్ష రూపాయలు ఉంటుందని బాధితుడు వాపోయాడు. పొలం నుంచి తిరిగి వస్తుండగా రిలయన్స్ టవర్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద వేలాడుతున్న విద్యుత్ తీగలకు తగిలినట్లు చెప్పారు. వెంటనే అధికారులకు సమాచారం ఇచ్చామని, తక్షణమే స్పందించి నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు.

చేతిపంపు ఏర్పాటు

బెల్లంకొండ, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపాలెం ఎస్సీ కాలనీలో స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో చేతి పంపును ఏర్పాటు చేసినట్టు టీడీపీ మండల కోర్ కమిటీ సభ్యుడు వెన్నా సీతారామిరెడ్డి తెలిపారు. కాలనీలో నీటి సమస్యను స్థానికులు సీతారామిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లడంతో.. అయన స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత సిల్వర్ మోజేష్ సంప్రదించి బోరును ఏర్పాటు చేయించారు. గ్రామ పార్టీ అధ్యక్షుడు వీరారెడ్డి, సుబ్బారెడ్డి, వెంకటరెడ్డి, రామిరెడ్డి, నరసింహారావు, ఏసోబు పాల్గొన్నారు.

నామినీ పెన్షన్‌కు దరఖాస్తు చేసుకోవాలి

● డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఝాన్సీరాణి


డీఆర్‌డీఏ పీడీ ఝాన్సీరాణి

నకరికల్లు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పెన్షన్ పొందుతూ భర్త మరణిస్తే నామినీ పింఛన్ పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ, మండల ప్రత్యేక అధికారి ఝాన్సీరాణి కోరారు. శనివారం ఆమె మాట్లాడుతూ 2019 ఏప్రిల్ నుంచి నవంబరు 2023 మధ్య కాలంలో పింఛన్‌దారులు మరణించి ఉంటే.. స్పౌజ్ పింఛను కోసం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు దరఖాస్తులను స్వీకరించాలని ఆదేశించారు.

అచ్చంపేట తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ


ఎస్ చంద్రశేఖర్

అచ్చంపేట, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): అచ్చంపేట తహసీల్దార్‌గా ఎస్.చంద్రశేఖర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. తహసీల్దార్ శ్రీనివాసరావు కలెక్టరేట్‌కి బదిలీ అయ్యారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా ప్రవీణ్ కుమార్

క్రోసూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బెల్లంకొండ తహసీల్దార్ టి.ప్రవీణ్‌కుమార్ నియమితులయ్యారు. తహసీల్దార్ వేముల వెంకటనాగరాజు సెలవుపై వెళ్లారు.

రెంటచింతల సొసైటీ అధ్యక్షుడిగా తుమ్మా జోజిరెడ్డి


తుమ్మా జోజిరెడ్డి

రెంటచింతల,సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రెంటచింతల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పీఏసీఎస్) అధ్యక్షుడిగా తుమ్మా జోజిరెడ్డిని నియమిస్తూ జిల్లా సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్ కె.శివయ్య శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. సభ్యులుగా గొట్టం లక్ష్మీ మల్లారెడ్డి(మిట్టగుడిపాడు) చేర్పేడి రామలక్ష్మి(రెంటాల)లను నామినేట్ చేశారు.

దేవీ శరన్నవరాత్రులకు ఏర్పాట్లు ప్రారంభం

దాచేపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : దాచేపల్లి గ్రామ దేవత వీర్లంకమ్మ తల్లి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రుల వాల్ పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఆలయంలో టీడీపీ సీనియర్ నాయకుడు బోడ్డు వెంకటేశ్వర్లు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు యలమల నరేష్, తక్కెళ్లపాడు టీడీపీ యూత్ నాయకుడు శ్రీనివాసరావు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 22 నుంచి శరన్నవరాత్రులు ప్రారంభమవుతున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి


ఎమ్మెల్యే కన్నాకు వినతి పత్రం అందజేస్తున్న ఏపీటీఎఫ్ నేతలు

సత్తెనపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేయాలని ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శనివారం గుంటూరులో సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణను కలసి వినతి పత్రం అందజేశారు. ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. కె. బసవలింగేశ్వరరావు, మహమ్మద్ జలీల్, ఉస్మాన్, ఎం.శ్రీనివాసరావు, జె.శివారెడ్డి, వి.శ్రీనివాసరావు ఉన్నారు.

కపోతేశ్వరస్వామి సన్నిధిలో తెలంగాణ మాజీ సీఎస్


తెలంగాణ మాజీ సీఎస్ శాంతకుమారిని సత్కరిస్తున్న అర్చక స్వామి దంపతులు

నకరికల్లు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ మాజీ చీఫ్ సెక్రటరీ ఎ.శాంతి కుమారి శనివారం నకరికల్లు మండలం చేజర్ల గ్రామంలోని కపోతేశ్వర స్వామిని దర్శించుకున్నారు. కపోతేశ్వర స్వామికి ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. శాంత కుమారి ప్రస్తుతం డాక్టర్ మర్రి చెన్నారెడ్డి హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ వైస్ చైర్మన్, డైరెక్టర్ జనరల్‌గా కొనసాగుతున్నారు. ఆమెకు ఆలయ అర్చకస్వామి కొండూరు వెంకట్రామయ్య దంపతులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. శాంత కుమారిని సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఉద్యోగి నూతలపాటి గోపరాజు ఉన్నారు.

రాజకీయ ఖైదీల హక్కుల కోసం ఉద్యమించిన జెతిన్‌దాసు


● పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి


నకరికల్లులో మాట్లాడుతున్న పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి

నకరికల్లు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాజకీయ ఖైదీల హక్కుల కోసం ఉద్యమించి జెతిన్ దాసు ప్రాణాలర్పించారని పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి పేర్కొన్నారు. శనివారం నకరికల్లులోని భగత్‌సింగ్ హాల్‌లో పీడీఎం ఆధ్వర్యంలో జెతిన్ దాసు సంస్మరణ సభ నిర్వహించారు. వెంకటేశ్వరరావు, కోటానాయక్, ప్రసన్నకుమార్, పిచ్చారావు,రామకృష్ణ పాల్గొన్నారు.

..గుర్తుకు రావడంలేదు

● పేర్లు, ఫోన్ నెంబర్లపైనా తడబాటు ● రోజురోజుకు పెరిగిపోతోన్న మతిమరుపు



గుంటూరు(తూర్పు), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోను.. సొల్లుఫోనుగానే కాకుండా రకరకాల మానసిక, శారీరక వ్యాధులకు కారణంగా మారుతోంది. సెల్‌ఫోన్‌కు బానిసలుగా మారిన వారిలో అనేక వ్యాధులు కనిపిస్తున్నాయి. వాటిలో డిజిటల్ డిమెన్షియా ఒకటి. సన్నిహితులు, ఫోన్ నెంబర్లు, కుటుంబసభ్యులు, దగ్గరి బంధువుల వివరాలు చెప్పలేని పరిస్థితి, మెదడు గజిబిజితో చిన్నా పెద్ద అన్న తేడా లేకుండా ఇబ్బందులు పడటం సర్వ సాధారణంగా మారింది. సాంకేతిక అధిపత్య యుగంలో మొబైల్ ఫోను, ట్యాబ్, కంప్యూటర్, టీవీ ఇతర సాంకేతిక పరికరాలు వినియోగం పెరిగింది. వయస్సుతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరూ వీటితో కాలక్షేపం చేసున్నారు. దీంతో గతంలో వృద్ధులలో సాధారణంగా కనిపించే డిమెన్షియా(చిత్త వైకల్యం) బారిన ఇప్పుడు చిన్న పిల్లలు, యువత పడు తున్నారు. నాడీ వ్యవస్థ దెబ్బతినడంతో పాటు విజ్ఞానం, సృజనాత్మకతను దెబ్బతీస్తుంది. దీంతో చిన్న చిన్న విషయాలను కూడా మరిచిపోతు న్నారు. ఈ సమస్య ఎక్కువగా మహిళలో కంటే మగవారిలో కనిపిస్తుంది.

మెదడుపై ప్రతికూల ప్రభావం

సాధారణంగా చదవడం, రాయడం ఇతర పనుల్లో మెదడు క్రియాశీలకంగా పనిచేస్తుంది. ఆదే మొబైల్ ఫోనులో వీడియోలు, గేమ్స్, సినిమాలు చూడటం చేస్తున్నప్పుడు చుట్టూ ఏం జరుగుతుందో కూడా గ్రహించలేకపోతున్నారు. డిజిటల్ తరగతుల రూపంలో విద్యార్థుల్లో స్క్రీన్ వినియోగం గణనీయంగా పెరిగింది. పాఠశాల, కళాశాలల్లో సైతం ప్రాజెక్ట్ వర్క్‌ల పేరుతో ఈ వినియోగం మరితంగా పెరిగింది. ఇంటర్‌నెట్‌లో శోధించడంతో మెదుడుకు పని చెప్పడం లేదు. దీంతో జ్ఞాపకశక్తి మీద ప్రభావం చూపుతోంది. దీంతో మెదడు డీయాక్టివ్ అవుతుంది. చిన్నపిల్లలో అయితే ఆటిజం వంటి తీవ్ర దుష్ప్రభావాలు తలెత్తున్నాయి.

పెరుగుతున్న డిజిటల్ డిమెన్షియా

డిజిటల్ డిమెన్షియా బాధితులు రోజురోజుకు పెరుగుతున్నారు. మొబైల్ అతివినియోగంతో ఈ సమస్యలు ఎదురువుతున్నాయి. సాధారణంగా చిన్నపిల్లల్లో ఆరేళ్ల వరకు మెదడు ఎదుగుతుంది. కాని చాలామంది తల్లిదండ్రులు పిల్లలకు సెల్ ఫోన్లు అలవాటు చేస్తున్నారు. దీంతో మెదడు ఎదుగుదల ఆగిపోతుంది. పిల్లలను ఫోన్లుకు కాకుండా మైదానపు క్రీడలకు అలవాటు చేయాలి. డిమెన్షియాను తొలిదశలో గుర్తించి వైద్యులను, మానసిక నిపుణులను సంప్రదించాలి.

-డాక్టర్ వెంకట కిరణ్, మానసిక వైద్య నిపుణుడు, జీజీహెచ్, గుంటూరు





పీఎం స్వనిధి...
చిరు వ్యాపారులకు పెన్నిధి

● కొనసాగనున్న కేంద్ర పథకం ● రుణం 50 శాతం పెంపు

సత్తెనపల్లి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం కోవిడ్-19 వ్యాప్తి సమయంలో చిరు వ్యాపారులను ఆదుకొనేందుకు ప్రవేశపెట్టిన పీఎం స్వనిధి పథకం గత డిసెంబరుతో నిలిచిపోయింది. దీనిని పునరుద్ధరించి 2030 వరకు కొనసాగించటంతో పాటు మంజూరు చేసే రుణాన్ని 50 శాతం మేర పెంచనున్నారు. తోపుడు బండ్లు, రహదారుల పక్కన తాత్కాలిక దుకాణాల్లో వివిధ వ్యాపారాలు చేసే వారికి చేయూత నిచ్చి వారి జీవనోపాధి మెరుగయ్యేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక కార్యాచరణను అమలు చేస్తున్నాయి. పట్టణాల్లోని చిరు వ్యాపారులకు గుర్తింపు కార్డులు జారీ చేసే ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టగా కేంద్రం స్వనిధి పథకాన్ని కొనసాగిస్తున్నట్లు శుభవార్తను వెలువరించింది.

మెప్మా ఆధ్వర్యంలో...

2020 జూన్‌లో ప్రారంభించిన పీఎం స్వనిధి యోజన పథకం కింద మెప్మా ఆధ్వర్యంలో గుర్తించిన వీధి వ్యాపారులకు తొలి విడతగా రూ. 12వేలు, రెండో విడతలో రూ. 15వేలు, మూడవ విడతలో రూ. 30వేలు చొప్పున రుణాలు అందించారు. తాజాగా ఈ పథకాన్ని పునరుద్ధరించటంతో చిరు వ్యాపారులు పెట్టుబడి కోసం అధిక వడ్డీలకు అప్పులు చేయాల్సిన బాధ తప్పనుంది. తొలి విడత రుణాన్ని ప్రస్తుతం రూ. 15వేలకు పెంచారు. రెండో విడత రూ. 30వేల వరకు ఇవ్వనున్నారు. దీనికి సంబంధించిన మార్గదర్శకాలు వెలువడ్డాక పెట్టుబడులు అవసరమైన వీధి వ్యాపారులను ఆర్‌పీల ద్వారా గుర్తించే ప్రక్రియ ప్రారంభమవుతుందని మెప్మా అధికారి ఖాజా తెలిపారు.

కుడి కాలువలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

విజయపురిసౌత్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి):నాగార్జున సాగర్ కుడికాలువలో గత గురువారం గల్లంతైన వ్యక్తి మృతదేహం శనివారం లభ్యమైంది. రెంటచింతల మండలం రెంటాలకు చెందిన పల్లె అంజిరెడ్డి (35) విజయపురి సౌత్‌లోని వైన్ షాపులో పనిచేస్తున్నాడు. అప్పుల బాధతో మనస్తాపానికి గురై తాళ్లపల్లి కుడి కాలువ వద్దకు వచ్చి కుటుంబసభ్యులకు వీడియో కాల్ చేసి కాలువలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బుగ్గవాగు వద్ద అంజిరెడ్డి మృతదేహం లభ్యమైంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

అమరేశ్వర స్వామి దేవస్థాన ధర్మకర్త మండలి నియామకం

అమరావతి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాల చాముండికా సమేత అమరేశ్వరస్వామి దేవస్థాన ధర్మకర్తల మండలిని నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. వంశపారంపర్య ధర్మకర్తగా వాసిరెడ్డి మురళీకృష్ణప్రసాద్‌ను, సభ్యులుగా పీ నాగేశ్వరశర్మ (అమరావతి), వడ్లమూడి శివపార్వతి (ధరణికోట), మేకల శివశంకర్ (అమరావతి), గంటా పున్నారావు (గుంటూరు), పోలిశెట్టి వెంకటసత్యనారాయణ (అమరావతి), ఆలా వీరబాబు (అమరావతి), నాదెండ్ల శ్రీదేవి (అమరావతి), సూరేపల్లి అనూష (లింగాపురం), మేడా వెంకటరమణ (అత్తలూరు), ఎం ఉషారాణి (అమరావతి)ని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ప్రతిపాదించగా ప్రభుత్వం నియమించింది. అఫీషియో సభ్యునిగా కే సుధీర్‌శర్మను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్లాస్టిక్ రహిత మాచర్ల వైపు అడుగులు

● లెగసీ వేస్ట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు

మాచర్ల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మాచర్లను ప్లాస్టిక్ రహిత పట్టణంగా మార్చేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మూడు నెలల క్రితం ఈ బృహత్తర కార్యక్రమానికి వారు శ్రీకారం చుట్టారు. 30 వేల టన్నుల ప్లాస్టిక్ శుద్ధిని లక్ష్యంగా పెట్టుకొని ఇందుకు గాను రూ. 1.80 కోట్లతో టెండర్లను పిలిచారు. లెగసీ వేస్ట్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ ఏర్పాటు చేసి స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా చెత్త నుంచి ప్లాస్టిక్‌ను వేరు చేస్తున్నారు. పట్టణంలో 16 వేల టన్నులు ప్లాస్టిక్ లభ్యంకాగా ఇప్పటికే 15 వేల టన్నుల శుద్ధి పూర్తయింది. మరో వేయి టన్నులు మిగిలి ఉంది.

ప్లాస్టిక్‌ను వేరుచేసి..

లెగసీ వేస్ట్ ట్రీట్‌మెంట్ ద్వారా పొడి చెత్త నుంచి ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేస్తున్నారు. మాచర్ల పట్టణం, గురజాల, దాచేపల్లి మునిసిపాలిటీల నుంచి కూడా టిప్పర్ల ద్వారా చెత్తను తీసుకొస్తున్నారు. పొడి చెత్త (లెగసీ వేస్టు) నుంచి ప్లాస్టిక్‌ను, కంపోస్టును, రాళ్లను, గాజు సీసాలను మిషనరీ ద్వారా వేరు చేస్తున్నారు. ప్లాస్టిక్‌ను సిమెంట్ ఫ్యాక్టరీలు, పవర్ ప్లాంట్‌లకు పంపుతున్నారు. మిగిలిన కంపోస్టు, రాళ్లు, గాజు సీసాలను మట్టితో కలిపి లెగసీ వేస్ట్ ట్రీట్‌మెంట్ వద్దనే చదును చేయనున్నారు. ఆ పై చదును చేసిన ప్రదేశంలో గ్రీనరీ ఏర్పాటు చేయనున్నారు.

త్వరలోనే పూర్తి..



ఇప్పటికే 15 వేల టన్నులు పూర్తి చేశాం. ఒక వెయ్యి టన్నులు మాత్రమే మిగిలింది. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున పని ఆలస్యమవుతోంది. మరి కొద్ది రోజుల్లోనే లక్ష్యానికి చేరుకుంటాం. అలాగే తడి చెత్తను కూడా సేకరించి వ్యర్థాలను ఎరువుగా తయారు చేసి రైతులకు విక్రయించేలా చర్యలు చేపడతాం.

-మున్సిపల్ కమిషనర్ వేణుబాబు





వేరు చేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు, కంపోస్టు



సాగర్‌లో 26 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల

విజయపురిసౌత్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎగువున ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు నుంచి నాగార్జున సాగర్‌కు భారీగా వరద నీరు వచ్చి చేరడంతో శనివారం 26 క్రస్ట్ గేట్లను తెరిచి దిగువకు నీటిని విడుదల చేశారు. శ్రీశైలం నుంచి ఇన్‌ఫ్లోగా 2,81,352 క్యూసెక్కుల నీరు వచ్చి చేరిందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం జలాశయ నీటి మట్టం 589.70 అడుగులుగా ఉంది. ఇది 311.14 టీఎంసీలకు సమానం. కాగా, కుడి కాలువ ద్వారా 9,019 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6,325 క్యూసెక్కులు, ప్రధాన జల విద్యుత్ కేంద్రం ద్వారా 32,764 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2,400, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు.. మొత్తం ఔట్‌ఫ్లోగా 2,60,602 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు.

టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు భారీగా వరద

● 18 రేడియల్ గేట్ల ద్వారా నీటి విడుదల


రెంటచింతల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సత్రశాలలోని నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. శనివారం 18 రేడియల్ క్రస్ట్ గేట్ల ద్వారా 3,06,500 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేసినట్లు ఎస్ఈ కె.వెంకటరమణ, ఈఈలు సుబ్రహ్మణ్యం, నాగరాజు తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల వరకు రెండు యూనిట్ల ద్వారా 1.0155 ఎంయూల విద్యుత్ తయారవగా.. శనివారం మధ్యాహ్నం నుంచి కరెంట్ తయారీని నిలిపివేశామని చెప్పారు. ఎగువన ఉన్న సాగర్ నుంచి 3 లక్షల 10 వేల క్యూసెక్కుల నీరు వస్తుందన్నారు. రిజర్వాయర్‌లో 74.45 మీటర్ల మేర నీరుందని, ఇది 6.376 టీఎంసీలకు సమానమని తెలిపారు.



18 రేడియల్ క్రస్ట్ గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

ప్రకాశం బ్యారేజీ వద్ద పెరిగిన వరద ఉధృతి

తాడేపల్లి టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాజెక్టుల నుంచి నీటిని విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి పెరిగింది. ఎగువన ఉన్న పులిచింతల ప్రాజెక్టుతోపాటు ప్రధాన వాగుల నుంచి 1,66,930 క్యూసెక్కుల వరదనీరు శనివారం ఇన్‌ఫ్లోగా నమోదయిన్నట్లు ఇరిగేషన్‌శాఖ జేఈ రాజేశ్ తెలిపారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12 అడుగుల నీటిమట్టం నమోదవుతుండగా దిగువకు 1,58,175 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు చెప్పారు. అలాగే తూర్పు డెల్టా కాలువకు 5,748 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టాకు 3,007 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. గుంటూరు చానల్ కాలువకు నీటి విడుదలను నిలిపివేసినట్లు జేఈ రాజేశ్ చెప్పారు.



దిగువకు విడుదలవుతున్న కృష్ణానది వరదనీరు

డెంగ్యూ, మలేరియాలు లేవు.. సాధారణ జ్వరాలే

● డీఎంహెచ్‌వో విజయమ్మ



కొల్లూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడా డెంగ్యూ, మలేరియా కేసులు నమోదు కాలేదని, ప్రస్తుతం వస్తున్న జ్వరాలన్నీ సీజనల్ వ్యాధులేనని జిల్లా వైద్య అధికారి (డీఎంహెచ్‌వో) విజయమ్మ పేర్కొన్నారు. శనివారం ఆంధ్రజ్యోతిలో వణికిస్తున్న వైరల్ ఫీవర్లు శీర్షికతో ప్రచురితమైన వార్తకు స్పందించిన డిఎంహెచ్‌వో కొల్లూరు ప్రాథమిక వైద్యారోగ్య కేంద్రాన్ని సందర్శించి డెంగ్యూ, మలేరియా కేసులపై అక్కడ విధులు నిర్వహిస్తున్న ఇన్‌చార్జి వైద్యురాలు కావ్యను ఆరా తీశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ, జిల్లాలో స్వల్పంగా వైరల్ జ్వరాలు, టైఫాయిడ్ జ్వరాలు మాత్రమే నమోదవుతున్నాయని, డెంగ్యూ, మలేరియా ఇప్పటి వరకు గుర్తించలేదని డిఎంహెచ్‌వో పేర్కొన్నారు. జ్వరంతో బాధపడుతూ ఆసుపత్రికి వచ్చిన రోగులకు రక్త పరీక్షలు నిర్వహిస్తునట్లు వివరించారు. జిల్లావ్యాప్తంగా నీటి నమూనాలను సేకరిం చి రీజనల్ ల్యాబ్‌కు పంపి పరీక్షలు చేయిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుతం వర్షాలు, వరదల వల్ల నీరు కలుషితం అయ్యే అవకాశాలు ఉన్నాయని అన్నారు. కలుషితమయిన బోర్లను గుర్తించి వాటిని సీజ్ చేయించామని, దోమల నివారణకు మందులు పిచికారీ చేయించామని తెలిపారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. ఆర్ఎంపీలు ప్రాథమిక చికిత్స మాత్రమే అందించాలని ఆదేశించారు. స్టెరాయిడ్, ఫ్లూయిడ్స్, ఐవి వంటి ఇంజక్షన్లతో కొన్ని రోజుల పాటు వ్యాధులు అదుపులోకి వచ్చినా మళ్లీ తిరగబెడతాయన్నారు. రోగులు ప్రభుత్వ వైద్యశాలలతో పాటు అనుభవజ్ఞులైన వైద్యులను మాత్రమే సంప్రదించాలని సూచించారు. వైద్యశాలల్లో మందులు, ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయని డీఎంహెచ్‌వో తెలిపారు.

తెనాలిలో మురుగునీటి శుద్ధి ప్లాంటు

● రూ.30 కోట్లతో నిర్మాణం ● పట్టణంలో తీరనున్న మురుగు సమస్య

తెనాలి అర్బన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెనాలి పట్టణంలో మురుగునీటి శుద్ధి ప్లాంట్లు నిర్మాణం పూర్తయింది. ఈ ప్లాంటులో రోజుకు కోటి లీటర్ల మురుగు నీటిని శుద్ధి చేసి మంచి నీటిగా మరల్చనున్నారు. నాజరుపేట చివర పూలే కాలనీ వద్ద రెండున్నర ఎకరాల స్థలంలో రూ.30.06 కోట్లతో ఈ ప్లాంటును నిర్మించారు. కేంద్ర ప్రభుత్వ అమృత్ పథకంలో భాగంగా చేపట్టిన ఈ ప్లాంటు పనులను 2018లో అప్పటి ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ శంకుస్థాపన చేశారు. గత ప్రభుత్వ విధానాలు, కరోనా కారణంగా నిలిచిపోయిన ప్లాంటు నిర్మాణ పనులు, కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత చకచకా పూర్తయ్యాయి. జంపని డ్రెయిన్ ద్వారా వచ్చిన మురుగునీటిని ప్లాంటుకు అనుసంధానం చేసి శుభ్రపరిచేందుకు అవసరమైన బావులు, యంత్రాలు ఏర్పాటు చేశారు. పట్టణంలోని జంపని డ్రెయిన్, బోసురోడ్డులోని ఉషోదయ మార్కెట్ ఎదుట ప్రారంభమవుతుంది. ఈ డ్రెయిన్‌లోకి పట్టణంలోని సింహభాగం మురుగునీరు, వర్షపు నీరు ప్రవహించి కాలనీ వెలుపలి డ్రెయిన్‌లో కలుస్తుంది. గత కొన్నేళ్లుగా ఈ డ్రెయిన్ వెంబడి స్థలాలను ఆక్రమించి ఇళ్లు నిర్మించుకోవడంతో కాల్వ వెడల్పు తగ్గిపోయి మురుగునీటి పారుదల సమస్యగా మారింది. వ్యర్థాలతో నిండిపోవడం, డ్రెయిన్ వెడల్పు తగ్గిపోవడం కారణంగా నీటి ప్రవాహం ఆశించిన స్థాయిలో వెళ్లకపోవడంతో పట్టణంలోని పలు ప్రధాన రహదారులు చిన్నపాటి వర్షాలకే చెరువుల్లా మారే స్థితి ఏర్పడింది. ఈ సమస్యను గుర్తించిన అధికారులు, ప్రజా ప్రతినిధులు మురుగునీటి శుద్ధి ప్లాంటు నిర్మాణానికి ప్రతిపాదించారు.

నెల రోజులుగా ట్రయల్ రన్

ముంబైకి చెందిన కిలారి ఇన్‌ఫ్రా స్ట్రక్చర్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నిర్మాణ బాధ్యతలు చేపట్టి నెల రోజులుగా ట్రయల్ రన్ కూడా నిర్వహిస్తోంది. పదేళ్ల పాటు ఈ సంస్థకు చెందిన సిబ్బంది ప్లాంటు నిర్వహణా బాధ్యతలు నిర్వహిస్తారు. ప్రధాన డ్రెయిన్ నుంచి ఇన్‌లెట్ చాంబర్‌కు వచ్చిన మురుగునీరు చెత్త, వ్యర్థాలు తొలగించి మరో పెద్ద బావిలోకి చేరుస్తారు. ప్రాథమిక ట్రీట్‌మెంట్ పూర్తయ్యాక రెండు భారీ ట్యాంకుల్లోకి మురుగునీరు చేరుతుంది. నీటిని పంపేందుకు 50, 20, 10.5 హెచ్‌పీ స్థాయి భారీ మోటార్లను ఐదింటిని ఏర్పాటు చేశారు. దీనికి తోడు 150 హెచ్‌పీ స్థాయి కలిగిన మూడు బ్లోయర్లు కూడా పనిచేస్తాయి. ఎస్‌బీఆర్ టెక్నాలజీతో మురుగునీటిలో ఉన్న బ్యాక్టీరియాను, క్రిములను నిర్మూలించనున్నారు.



మురుగు నీటి శుద్ధి కేంద్రం

సాగు నీటి అవసరాలకు శుద్ధి అయిన నీరు

శుద్ధి అయిన నీటిని క్లోరినేషన్ చేసి సాగునీటి కాల్వలకు అవుట్‌లెట్ ద్వారా పంపించే ఏర్పాట్లు చేశారు. శుద్ధి అయిన నీటిని పొలాల అవసరాలతో పాటు ప్లాంటు స్థలంలో గార్డెనింగ్ కోసం, పట్టణంలో అవసరమైన చోట్లకు పంపుతారు. మురుగు నీరు శుద్ధి చేశాక పరీక్షించేందుకు ల్యాబోరేటరీ కూడా నిర్మించారు. ఎప్పటికప్పుడు శుద్ధి అవుతున్న విధానం ఫలితాలను పొల్యూషన్ బోర్డుకు కూడా అందే ఏర్పాటు చేశారు. ప్లాంటును ఈ నెల 14న ప్రారంభించాలని తలపెట్టినప్పటికీ అల్పపీడనం కారణంగా వాయిదా వేశారు.



శుద్ధి అనంతరం ట్యాంకుల్లోకి చేరిన నీరు



నీటిని పరీక్షించే ల్యాబ్

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

పాఠశాలకు మైక్ సెట్ అందజేత

వినుకొండ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్ఎస్‌పీ కాలనీ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఉపాధ్యాయుల కోరిక మేరకు రోటరీ క్లబ్ సభ్యులు గుత్తా గురునాథం సౌజన్యంతో రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ ఆధ్వర్యంలో శనివారం మైక్ సెట్ అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఏరువ వెంకట నారాయణ, క్లబ్ కార్యదర్శి షేక్ బాజీ, క్లబ్ జిల్లా ముఖ్యులు చిరుమామిళ్ల కోటేశ్వరరావు, క్లబ్ డైరెక్టర్‌లు జాలాది నాగప్రసాద్, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

దళిత రణభేరి కరపత్రాల ఆవిష్కరణ

వినుకొండ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 24న విజయవాడలో జరిగే దళిత రణభేరి కార్యక్ర మాన్ని జయప్రదం చేయాలని పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కంభంపాటి నాగ వంశీ పిలుపునిచ్చారు. పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో శనివారం దళిత రణభేరి కరపత్రాలను పార్టీ నాయకులు ఆవిష్కరించారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పత్రా వెంకటయ్య, పట్టణ నాయకులు పాల్గొన్నారు

దోమల నివారణ చర్యలు

రొంపిచర్ల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మునమాక గ్రామంలో దోమల నివారణకు మందును పిచికారి చేయించారు. రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పోతిరెడ్డి జగన్ నరసింహారెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ రామయ్య కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

దయామయుడు ప్రవక్త మహమ్మద్

వినుకొండ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక లాయర్ స్ట్రీట్‌లో నూరుబాషా ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సిర తున్ నబి కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంఘ గౌరవ అధ్య క్షుడు సీనియర్ న్యాయవాది ఎస్కే సిద్ధయ్య అధ్యక్షత వహించి మాట్లాడుతూ మానవాళికి రాజ మార్గం చూపి శాంతి ప్రేమను బోధిం చిన దయామయుడు దైవప్రవక్త మహమ్మద్ (స) అని చెప్పారు. కార్యక్రమంలో నూరుబాషా సంఘం ఉపాధ్యక్షుడు షేక్ మస్తాన్, షేక్ సాయిబాబా, సిద్ధారపు. ఫరీద్ పాల్గొన్నారు.

ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

శావల్యాపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తలూరు, శావల్యాపురం గ్రామాల్లోని అంగనవాడీ కేంద్రాల్లో ఆయా పోస్టులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కుప్పం శ్రీలత శనివారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ కొత్తలూరులో ఓసీ కేటగిరికి చెందిన మహిళలు, శావల్యాపురంలో ఎస్సీ కేటగిరికి చెందిన మహిళలు దరకాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 26వతేదీ లోపు వినుకొండలోని సీడీపీవో కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు.

కళోత్సవంలో శావల్యాపురం విద్యార్థులకు ద్వితీయస్థానం

శావల్యాపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): బోయపాలెంలోని డైట్ కళాశాల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో శుక్రవారం నిర్వహించిన కళోత్సవం పోటీల్లో శావల్యాపురం జడ్పీ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు అత్యుత్తమ ప్రదర్శనలతో ద్వితీయస్థానం నిలిచినట్లు పాఠశాల హెచ్‌ఎం బొడ్డపాటి విజయలక్ష్మి శనివారం తెలిపారు. హెచ్‌ఎం మాట్లాడుతూ చిత్రలేఖనం పోటీలో పాఠశాలకు చెందిన వెన్నెల ద్వితీయస్థానం సాధించగా, స్టోరీ టెల్లింగ్‌లో బాజీ నాగూర్‌బీ ద్వితీయస్థానం సాధించినట్లు తెలిపారు. విజేతలకు డీవైఈవో మహమ్మద్ సుభానీ బహుమతులు అందజేసి అభినందించారు.

ఆలయ బోర్డు సభ్యుల నియామకం

నరసరావుపేట రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇసప్పాలెం గ్రామంలో గల శ్రీమహంకాళీ అమ్మవారి దేవస్థానం బోర్డుసభ్యులను నియమిస్తూ ప్రభుత్వం ఈ నెల 12వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. సభ్యులుగా బండ్లమూరి చంద్రశేఖర్, పిల్లుట్ల నాగేశ్వరరావు, రాజవరపు కృష్ణ, కుంచాల పార్వతి, జింకల శ్రీనివాసరావు, చూపురి పేరమ్మ, పిన్నబోయిన రామయ్య, పోపూరి విజయలక్ష్మి, పల్లబోతు రమాదేవి, జాలి అయ్యప్ప, బిల్లా వెంకట రాజ్యలక్ష్మిలను నియమించారు. ఎక్స్ అఫిషియల్ సభ్యుడిగా ఆలయ పూజారి నందూరి కాళీకృష్ణను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ప్రధాని మోదీ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించాలి

శావల్యాపురం(గుంటుపాలెం), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 75వ జన్మదిన వేడుకలను ఈనెల 17 వతేదీన మండలంలోని 15గ్రామ పంచాయతీల్లో ఘనంగా నిర్వహించాలని బీజేపీ మండలాధ్యక్షుడు గట్టుపల్లి శ్రీనివాసరావు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. సేవా పక్వాడా కార్యక్రమంలో భాగంగా మండలంలోని గుంటుపాలెంలో మండల కార్యశాల కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఆదేశాల మేరకు ఈనెల 17నుంచి అక్టోబరు 2వరకు గ్రామాల్లో నిర్వహించాల్సిన కార్యక్రమాలపై నాయకులకు, కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ అన్నవరపు శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షులు రావినూతల ఆదాము పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌కు వచ్చి గుండెపోటుతో వ్యక్తి మృతి

వినుకొండటౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): లోక్ అదాలత్‌లో కేసు నిమిత్తం శనివారం వినుకొండ వచ్చిన షేక్ సైదా (56) గుండెపోటుతో మృతిచెందాడు. బొల్లాపల్లి మండలం గుమ్మనంపాడుకు చెందిన షేక్ సైదా స్థానిక టీడీపీ నాయకుడు వాసుదేవ రెడ్డి వద్ద కారు డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గతంలో వినుకొండ కోర్టులో నమోదైన ఓ కేసులో సాక్ష్యం నిమిత్తం భార్య లాల్‌బీతో కలిసి వినుకొండ కోర్టు వద్దకు చేరుకున్నాడు. గుండెల్లో మంటగా ఉందని కోర్టు కానిస్టేబుల్ అనుమతితో వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు చేరుకున్నాడు. వైద్యశాల వద్దకు చేరుకున్న కొద్ది నిమిషాలకే గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

వైద్యుల నిర్లక్ష్యంపై ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆగ్రహం



వైద్యశాలలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వినుకొండటౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వినుకొండ ప్రభుత్వ వైద్యశాలలో వైద్యు ల నిర్లక్ష్య వైఖరిపై ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతపురం సభ అనంతరం వినుకొండకు వచ్చిన జీవీ ఆంజనేయులు మొట్టమొదటి సారిగా వినుకొండ ప్రభుత్వ వైద్యశాలను శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ నెల 7వ తేదీన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన ప్రభుత్వ వైద్యశాలలో వైద్యుల కొరత అనే శీర్షిక పై జీవీ ఆంజనేయులు స్పందించారు. వైద్యశాలలో పనిచేస్తున్న డాక్టర్లు హారికారెడ్డి, శిరీషాలు రిజిస్టర్‌లో సంతకం పెట్టి బయట ప్రైవేటు వైద్యశాలల్లో సేవలు అందిస్తున్న సమాచారం తెలుసుకొని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి న తరువాత ప్రభుత్వ వైద్యశాలల్లో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాద వ్ కృషి చేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో వినుకొండ ప్రభుత్వ వైద్యశాల లో 30 నుంచి 40 ఓపీ ఉండేదని, నేడు 300లకు పైగా ఓపీ నమోదవుతుందని, పేదలకు మంచి వైద్యం అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో వైద్యులను ఏర్పాటు చేశారన్నారు. కష్ట పడే వైద్యులను ప్రోత్సహిస్తామని, పేదలకు మెరుగైన వైద్యం అందించాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఇద్దరు డాక్టర్ల నిర్వాహకంపై ఫోన్ ద్వారా ఉన్నతాధికరులకు ఫిర్యాదు చేశారు. ఇక నుంచి వైద్యశాలలపై ఉన్నతాధికారులతో పాటు తాను ఆకస్మిక తనిఖీలు చేపట్టి పనితీరును మెరుగుపరుస్తామని తెలిపారు. ఆయన వెంట ప్రముఖ సీనియర్ న్యాయవాది సైదారావుతో ప్రభుత్వ వైద్యాధికారి శ్రీనివాసరెడ్డి, వైద్యశాల సిబ్బంది పాల్గొన్నారు.

● బొల్లాపల్లి మండలం గుమ్మనంపాడుకు చెందిన షేక్ సైదాగుండెపోటుతో మృతి చెందాడనే సమాచారం మేరకు ఆయన మృతదేహాన్ని సందర్శించి కుటుంబసభ్యులకు జీవీ అంజనేయులు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సైదా కుటుంబానికి అండగా ఉంటామని భార్య లాల్‌బీకి భరోసా కల్పించారు.

సమసమాజ నిర్మాణం ఉపాధ్యాయులతోనే సాధ్యం

● ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు



ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును సత్కరిస్తున్న ఈఈఈ అసోసియేషన్ నాయకులు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సమ సమాజ నిర్మాణం ఉపాధ్యాయులతోనే సాధ్యం అవుతుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శనివారం పట్టణంలోని భువన చంద్ర టౌన్‌హాల్లో ఎడ్యుకేషన్, ఎంప్లాయి మెంట్, ఎంపవర్‌మెంట్ (ఈఈఈ) అసోసియేషన్ ఆధ్వర్యంలో 2024-25 అకడమిక్ లో పదో తరగతిలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన మాదిగ విద్యార్థులకు బహుమతుల ప్రదానోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడు తూ ఆధునిక సమాజంలో విద్యార్థుల సృజనాత్మకత ఏఐ టెక్నాలజీని మించి ఉంద న్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మాటలను గుర్తుచేస్తూ సమా జంలో గౌరవం కులం, మతంతో కాకుండా చదువుతో మాత్రమే వస్తుందన్నారు. కార్యక్రమానికి ఈఈఈ అసోసియేషన్ అధ్యక్షుడు పల్లెపోగు రవిరాజు అధ్యక్షత వహించారు. 26 మంది టాపర్లకు ప్రతి ఒక్కరికి రూ.10 వేలు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పూనూరి ఆనందరావు, ప్రోగామ్ కన్వీనర్ హంతా స్పష్టరాజ్, ప్రొఫెసర్ సీ కాశీం, ఉప్పులూరి టైటస్‌పాల్, ఇంటూరి నాగేశ్వరరావు, కొట్టా కిరణ్ తదితరులు పాల్గొ న్నారు.

నాదెండ్ల తహసీల్దార్ చంద్రశేఖర్ బదిలీ



చంద్రశేఖర్

నాదెండ్ల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నాదెండ్ల తహసీల్దార్‌గా పని చేస్తున్న ఎస్ చంద్రశేఖర్ బదిలీ అయ్యారు. ఆయనను అచ్చం పేటకు బదిలీ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు. రెండు నెలల క్రితం ఆయన గూడూరు నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న ఏవీ రమణను బదిలీ చేయటంపై అప్పట్లో విమర్శలు వచ్చాయి. ఈ రెండు నెలల కాలంలో ఆయన రైతులకు సంబంధించి రెవెన్యూ సమస్యల పరిష్కారంలో అర్జీలను చంద్రశేఖర్ పెద్దసంఖ్యలో తిరస్కరించారు. ఐతే ఊహించని విధంగా ఆయన ఇక్కడి నుంచి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న సాల్మన్ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా వ్యవహరించనున్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 571 కేసుల పరిష్కారం



కేసులు పరిష్కరిస్తున్న న్యాయాధికారి డాక్టర్ నేతి సత్యశ్రీ

నరసరావుపేట లీగల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండలన్యాయ సేవాధి కార సంస్థ ఆధ్వర్యంలో శనివారం కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. న్యాయాధికారులు మూడు బెంచ్‌లుగా ఏర్పడి వివిధ విభాగాలకు చెందిన 571 కేసు లను రాజీమార్గం ద్వారా పరిష్కరించారు. పరిష్కారమైన కేసుల్లో కక్షిదారులకు రూ. 4,60,66,931 మేరకు లబ్ధి చేకూరింది. అదాలత్‌లో న్యాయాధికారులు డాక్టర్ నేతి సత్యశ్రీ, కే మధుస్వామి, ఏ నలోమి, న్యాయవాద సంఘ అధ్యక్షుడు గన్నే వెంకట సుబ్బారావు, ఏపీపీ గుండాల సురేష్‌బాబు, ఏజీపీ కే సీతారామాంజనేయులు, పలువురు న్యాయవాదు లు, పోలీసులు, కక్షిదారులు పాల్గొన్నారు.

మెగా లోక్‌అదాలత్‌లో 372 కేసుల పరిష్కారం



లోక్ అదాలత్‌లో వివిధ కేసులను పరిశీలిస్తున్న న్యాయమూర్తి ఆశీర్వాదంపాల్

వినుకొండ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టు నందు మం డల లీగల్ సర్వీస్ అథారిటీ ఛైర్మన్, వినుకొండ జూనియర్ సివిల్ ఇన్ చార్జ్ జడ్జి ఆర్ ఆశీర్వాదం పాల్ ఆధ్వర్యంలో జాతీయ మెగా లోక్ అదా లత్‌ను శనివారం నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో పలు కేసులను రాజీ చేశారు. జడ్జి ఆశీర్వాదంపాల్ మాట్లాడుతూ లోక్ అదాలత్ ను ఎలా సద్వినియోగం చేసుకోవాలో వివరించారు. లోక్ అదాలత్‌లో మొత్తం 372 రాజీపడిన సివిల్, క్రిమినల్, పిల్ సీ, చెక్ బౌన్స్, తదితర కేసులను పరిష్కరించి రూ.90 లక్షలు కక్షిదారులకు ఇప్పించారని న్యాయమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బంది, లోక్ అదాలత్ సిబ్బంది పాల్గొ న్నారు.

మహిళలు, రైతులే లక్ష్యంగా..

రాజధానిలో సాగించిన అమానుషాలను ప్రజలు మర్చిపోరు

● ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాజధాని మహిళలు, రైతులే లక్ష్యంగా సాగించిన అమానుషాలను రాష్ట్ర ప్రజలు ఎన్న టికీ మర్చిపోరని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ విషయంలో జగన్ ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

అబద్ధాలు, మోసాలతో ప్రజల్ని మోసగించడమే జగన్‌కు తెలిసిన పాలన అని, అవకాశవాద, విధ్వంసకర రాజకీయాలకు ప్రతినిధి జగన్ అని వివరించారు. గతంలో ప్రజా రాజధాని అమరావతిపై విషం చిమ్మిన వైసీపీ నాయకత్వ పడగనీడలో ఉండటానికి రాజధానివాసులు, రాష్ట్ర ప్రజలు ఎప్పటికీ అంగీకరించరని పేర్కొన్నారు. ఐదేళ్ల వైసీపీ నేతలు ప్రచారం చేసిన కమ్మరావతి, ఎడారి, శ్మశానం, పందులు తిరిగే ప్రదేశం నుంచి మరలా పాలన ఎలా చేస్తారో అమరావతిపై వ్యాఖ్యా నించిన సజ్జల చెప్పాలని కోరారు. 2026లో జరిగే స్థానికసంస్థల ఎన్నికల్లో పోటీకి వెనుకాడుతున్న జగన్ మరలా అధికారంలోకి వస్తాడ నటం సజ్జల పిచ్చితనం అని పేర్కొన్నారు. రాజధానిని నిర్మించడం, మెడికల్ కాలేజీలు కట్టడమంటే రుషికొండ ప్యాలెస్, పార్టీ కార్యాల యాలు కట్టినంత తేలికకాదని తెలుసుకోవాలని కోరారు. పీపీపీ విధానమంటే తన దోపిడీకి పనికొచ్చిన క్విడ్ ప్రోకో విధానం కాదని జగన్ గ్రహించాలని, పీపీపీ విధానం లేకుండా ఏ దేశం, ఏ రాష్ట్రంలో నిర్మా ణాలు జరుగుతున్నాయో జగన్ చెప్పాలని డిమాండ్ చేశారు.

చేతిరాతపై విద్యార్థులకు శిక్షణ



చేతి రాతపై శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు జున్నుసాహెబ్

యడ్లపాడు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లింగారావుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక చేతిరాత శిక్షణ శిబిరాన్ని శనివారం నిర్వహించారు. చేతిరాత నిపుణుడైన ఉపాధ్యాయుడు జున్నుసాహెబ్ విద్యార్థులకు చేతిరాత మెళకువలను నేర్పించారు. ప్రతి అక్షరాన్ని అందంగా, ఆకర్షణీయంగా ఎలా రాయవచ్చో ప్రత్యక్షంగా బోర్డుపైన వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేవీ రామిరెడ్డి మాట్లాడుతూ అందమైన చేతిరాత విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తుందని అన్నారు. అనంతరం శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయుడు జున్నుసాహెబ్‌ను సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసీ కమిటీ ఛైర్మన్ షేక్ జాన్‌సైదులు, గ్రామపెద్దలు నంబూరు శివరామకృష్ణ, తోకల సత్యన్నారాయణ, ఉపాధ్యాయులు వి.శ్రీనివాసరావు, డి.సుధాకర్‌రావు, టి.విజయ శ్యామ్యూ ల్, యు.మల్లేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

సమృద్ధిగా యూరియా నిల్వలు : ఏవో



ఎరువుల ర్యాక్ వద్ద వివరాలు తెలుసుకుంటున్న జిల్లా వ్యవసాయ అధికారి జగ్గారావు

నాదెండ్ల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో యూరియాకు ఎలాంటి కొరత లేదని, సమృద్ధిగా నిల్వలు ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు అన్నారు. సాతులూరు గ్రామ పరిధి లోని రైల్వేస్టేషన్‌లో గల ఎరువుల ర్యాక్‌ను ఆయన శనివారం పరిశీలిం చారు. పల్నాడు జిల్లాకు కేటాయించిన యూరియాలో శనివారం 1100 మెట్రిక్ టన్నులు దిగుమతి అయింది. ఈ సందర్భంగా వివరాలను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు ఏడీఏ కేవీ శ్రీనివాస రావు, వ్యవసాయాధికారి టీ.శ్రీలత, సిబ్బంది జీపీ శ్రీనివాసరావు, రమేష్‌లు పాల్గొన్నారు.

25 వేల విత్తన బంతులు సిద్ధం



తయారుచేసిన విత్తన బంతులను ప్రదర్శించిన విద్యార్థులు

చిలకలూరిపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో కొండవీడు కొండలు, ఆ పరిసర ప్రాంతం లో చల్లేందుకు 25 వేల విత్తన బంతులను సిద్ధం చేశారు పట్టణం లోని చైతన్య లిటిల్ స్కూలు విద్యార్థులు 15వేలు, గణపవరంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు 10 వేల విత్తన బంతులను రోట రీ క్లబ్ సహకారంతో రెండు నెలలుగా శ్రమించి తయారు చేశారు. స్థానిక చైతన్య లిటిల్ స్కూల్లో శనివారం జరిగిన కార్యక్రమంలో రోటరీ డైరెక్టర్ దండా లక్ష్మీనారాయణ, క్లబ్ అధ్యక్షులు ఉప్పుటూరి ప్రసాద్ మాట్లాడుతూ ఒకటి రెండు రోజుల్లో కొండవీడు, ఆ పరిసర ప్రాంతాల కు విద్యార్థులను కొండవీడుకు తీసుకువెళ్లి విత్తన బంతులను చల్లిస్తా మని తెలిపారు. చైతన్య లిటిల్ ప్రిన్సిపాల్ దాసరి లక్ష్మి, ఏవో జి.రామకృష్ణ పాల్గొన్నారు.

యలమందలలో అధ్వానంగా పారిశుధ్యం

● ప్రధాన రహదారిలో పేరుకుపోయిన చెత్త, తూటుకాడలు



హైస్కూలు వద్ద పడేస్తున్న చెత్త

నరసరావుపేట రూరల్ (యలమందల), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యలమందల గ్రామంలో పారిశుధ్యం అధ్వా నంగా ఉంది. గ్రామంలోని ప్రధాన వీదుల్లోని మురుగు కాల్వల్లో పిచ్చి మొక్కలు మొలిచి మురుగు ప్రవాహాన్ని అడ్డుకుంటున్నాయి. గ్రామం లోని ప్రధాన రహదారిలో ఉన్న వినాయక గుడి వద్ద మురుగుకాల్వల పరిస్థితి అధ్వానంగా ఉంది. కొంత కాలంగా కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో మురుగునీటి పారుదల నిలిచిపోయింది. గ్రామంలోని ప్రభుత్వ హైస్కూలు వద్ద గ్రామంలో సేకరించిన చెత్తను డంప్ చేయడంతో దుర్వాసన వస్తుంది. గ్రామంలో బొడ్రాయి సెంటరు నుం చి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వెళ్లే రహదారిలో మురుగు కాల్వల పరిస్థితి మరింత అధ్వానంగా ఉంది. సంబంధిత ఉన్నతాధి కారులు వెంటనే స్పందించి కాల్వల్లో పూడికతీసి మురుగు ముందుకు కదిలేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.



వినాయక గుడి వద్ద సైడు కాల్వలలో పేరుకుపోయిన తూటుకాడ, చెత్త చెదారం



కలెక్టర్ కృతికా శుక్లాకు స్వాగతం పలుకుతున్న బదిలీ అయిన కలెక్టర్ పీ అరుణ్‌బాబు



కలెక్టర్ కృతికా శుక్లాకు స్వాగతం పలుకుతున్న జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్

కలెక్టర్ కృతికా శుక్లాకు ఘన స్వాగతం

నరసరావుపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించేందుకు కలెక్టరేట్‌కు వచ్చిన కృతికా శుక్లాకు జిల్లా అధికార యంత్రాంగం ఘనంగా స్వాగతం పలికింది. ఇక్కడ నుంచి బదిలీ అయిన కలెక్టర్ పీ.అరుణ్ బాబు, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డీఆర్‌వో మురళీ, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు, జిల్లా అధికారులు బొకెలు.. మొక్కలు అందజేసి కృతికా శుక్లాకు స్వాగతం పలికారు. ఈవో చంద్రశేఖరరావు అధ్వర్యంలో కోటప్పకొండ శ్రీ త్రికోటేశ్వర స్వామి దేవస్థానం అర్చకులు కలెక్టర్ కృతికా శుక్లాకు ఆశీర్వచనలు అందజేసి, స్వామి వారి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. జిల్లా అధికారులు కృతికా శుక్లా దంపతులను ఘనంగా సత్కరించారు.

తొలి మహిళా కలెక్టర్‌గా కృతిక శుక్లా నియామకం హర్షణీయం

● ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు మొదటి మహిళా కలెక్టర్‌గా కృతిక శుక్లా నియామకం ఎంతో సంతోషాన్ని కలిగించిందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు అన్నారు. శని వారం నరసరావుపేట కలెక్టరేట్‌లో నూతన కలెక్టర్‌గా కృతిక శుక్లా బాధ్యతలు స్వీకరిం చారు. ఎమ్మెల్యే అరవిందబాబు కృతిక శుక్లాకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి అమలు చేస్తున్న సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలు జిల్లాలోని అర్హులందరికి ఆటం కం లేకుండా అందేలా చూడాలని కోరారు. ఆయనతో పాటు కూటమి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జీ.బర్నబాస్ తదితరులు

కళా ఉత్సవంలో కే-రిడ్జి విద్యార్థులకు ప్రథమ బహుమతి

నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కళా ఉత్సవం- 2025 పోటీల్లో కే-రిడ్జి ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ఫోక్‌డాన్స్ గ్రూప్ విభాగంలో ప్రథమ బహుమతి సాధించారని ప్రిన్సిపాల్ జీ.బర్నబాస్ శనివారం తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా బోయపాలెంలో ఉన్న డైట్‌లో సమగ్ర శిక్ష అధ్వర్యంలో ఈ నెల 11, 12 తేదీల్లో జరిగిన కళా ఉత్సవం 2025 పోటీల్లో ఈ ఘనత సాధించారన్నారు. హృదయరెడ్డి, దీక్ష, లహిరిరెడ్డి, తేజస్విని, హర్షినిలు మొదటి స్థానంలో నిలిచారన్నారు. విద్యార్థులను పాఠశాల ఛైర్మన్ వెంకటేశ్వర్లు, క్యాంపస్ ఇన్‌చార్జి కోట బాపూజీ, డాన్స్ టీచర్ వెంకట్, జ్యోతిర్మయిలు అభినందించారు.

మట్టి ఖర్చులకు ఆర్థికసాయం


నరసరావుపేట టౌన్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పనసతోటకు చెందిన షేక్ మస్తాన్ వలి, ఆరో వార్డుకు చెందిన షేక్ మస్తాన్‌బీ తీవ్ర అనారోగ్యంతో మరణించారు. విషయం తెలిసిన వెంటనే నరసరావుపేట ఖబరస్తాన్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఒక్కొక్క కుటుంబానికి మట్టి ఖర్చుల నిమిత్తం శనివారం రూ.3 వేలు, మొత్తం రూ.6 వేలు అందజేశారు. మాజీ కౌన్సిలర్ షేక్ అబ్దుల్ గఫార్, షేక్ మస్తాన్ షరీఫ్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం చేస్తున్న ఖబరస్తానా అభివృద్ధి కమిటీ సభ్యులు

నాలుగు గ్రామాల్లో రీ సర్వే

● ప్రభుత్వ భూముల గుర్తింపు



సర్వే చేస్తున్న మండల సర్వేయర్ చండీరాణి, విలేజీ సర్వేయర్లు

నూజెండ్ల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తలార్లపల్లి, నూజెండ్ల, కొండ్రప్రోలు, ముక్కెళ్ళపాడు గ్రామాల్లో మూడో దశలో రీ సర్వే పనులు కొనసాగుతున్నాయి. మండలంలో 20 రెవెన్యూ గ్రామాలు ఉండగా మొదటి, రెండో ఫేజ్‌లో 12 గ్రామాలు పూర్తి కాగా మిగిలిన నాలుగు గ్రామాలైన ఐనవోలు, పుచ్చనూతల, వీ అప్పా పురం, తిమ్మాపురం గ్రామాలను నాలుగో దశలో పూర్తి చేయనున్నారు. మూడో విడత రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో మొదట గ్రామ సరిహద్దులు నిర్ధారించి ప్రభుత్వ భూములను గుర్తించి అనంతరం రైతుల పొలాలను సర్వే చేయను న్నారు. ఇప్పటికే మొదటి, రెండో విడత రీసర్వే పూర్తి చేసుకున్న గ్రామాల్లోని రైతులకు ఐదు వేల పాసు పుస్తకాలు కార్యాలయానికి వచ్చాయని, వివరాలను సరి చూసి ప్రభుత్వం నిర్ణయించిన తేదీల్లో భూయజమానులకు అందజేయను న్నట్టు తహసీల్దార్ జీ రమేష్‌కుమార్ తెలిపారు. గ్రామ సర్వేయర్, వీఆర్‌వోలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నాలుగు గ్రామాల్లో మూడో విడత రీ సర్వే పనులను నిర్వహిస్తున్నట్టు మండల సర్వేయర్ చండీరాణి తెలిపారు.

తల్లిదండ్రులు కూలీలు... తనయ కానిస్టేబుల్



కానిస్టేబుల్‌గా ఎంపికైన మహేశ్వరి

శావల్యాపురం(పోట్లూరు), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోట్లూరు బీసీ కాలనీకి చెందిన విద్యార్థిని యర్రగొర్ల మహేశ్వరి ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన పోలీస్ కానిస్టేబుల్ నియామకాల్లో ప్రతిభను కనబరచి కానిస్టేబుల్‌గా ఎంపికైంది. మహేశ్వరి తల్లిదండ్రులు యర్రగొర్ల హనుమంతరావు, వెంకటరత్నంలు వ్యవసాయ కూలీలుగా పనిచేస్తూ పిల్లల్ని బాగా చదివించారు. మహేశ్వరి ఉద్యోగం సాధించడంతో తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్థులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.